మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

Published from Jagitial
www.evarthalu.com

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం
TUESDAY
20-1-2026

జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00

సంపుటి: 1 Volume:1 | సంచిక: 201 Issue: 201


20 జనవరి 2026 - మంగళవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:53 సూర్యాస్తమయం - సా. 6:00 తిథి విదియ రా. 2:41 వరకు తరువాత తదియ సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం శ్రవణ మ. 12:56 వరకు తరువాత ధనిష్ఠ యోగం సిద్ధి రా. 7:52 వరకు కరణం బాలవ మ. 2:29 వరకు కౌలవ రా. 2:41 వరకు వర్జ్యం సా. 5:15 నుండి సా. 6:54 వరకు దుర్ముహూర్తం ఉ. 9:07 నుండి ఉ. 9:51 వరకు రా. 11:09 నుండి రా. 12:01 వరకు రాహుకాలం మ. 3:14 నుండి సా. 4:37 వరకు యమగండం ఉ. 9:40 నుండి ఉ. 11:03 వరకు గుళికాకాలం మ. 12:27 నుండి మ. 1:50 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:17 నుండి ఉ. 6:05 వరకు అమృత ఘడియలు తె. 3:11 నుండి తె. 4:51 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:04 నుండి మ. 12:49 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



# మనమూ.. ఉన్నోళ్లమే!

1947లో భారత్‌కు స్వాతంత్ర్యం సాధించినప్పుడు, మన ఆర్థిక వ్యవస్థ దయనీయ స్థితిలో ఉండేది. బ్రిటిష్ పాలన కాలంలో దేశం ఆర్థికంగా దోపిడీకి గురై, వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మిగిలిపోయింది. జనాభా సుమారు 34 కోట్లు, సాక్షరతా రేటు 12% మాత్రమే, జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి) రూ. 2.7 లక్షల కోట్లు మాత్రమే. ఇది ప్రపంచ జీడీపీలో 3% మాత్రమే. ఒకప్పుడు వెనుకబడిన వ్యవసాయ ఆధారిత దేశంగా ఉన్న భారత్, నేడు ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా నిలిచింది. మరో నాలుగేళ్లలో మన దేశం అప్పర్ మిడిల్ క్లాస్‌గా మారబోతోందట. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) వెల్లడించిన తాజా రిపోర్టులో ఈ విషయం వెల్లడైంది.

## నాలుగేళ్లలో భారత్ అప్పర్ మిడిల్ క్లాస్

**2028 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ**

- 2030 నాటికి తలసరి ఆదాయం 4 వేల డాలర్లు
- పేద నుంచి లో-మిడిల్ క్లాస్‌కు 60 ఏళ్ల కాలం
- లో-మిడిల్ నుంచి అప్పర్ మిడిల్ క్లాస్‌కు 22 ఏళ్లు!
- ఎస్బీఐ రిసెర్చ్ నివేదికలో కీలక అంశాలు వెల్లడి




న్యూఢిల్లీ: మరో నాలుగేళ్లలో భారత్ అప్పర్ మిడిల్ క్లాస్ దేశంగా మారుతుందని ఎస్బీఐ రిసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది. 2028 నాటికి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని, 2030 నాటికి అప్పర్ మిడిల్ ఇన్ కమ్ దేశాల క్లబ్ లో చేరుతుందని తెలిపింది. భారత్ అప్పర్ మిడిల్ క్లాస్‌గా మారే సమయానికి తలసరి ఆదాయం 4 వేల డాలర్లు (రూ. 3,63,541)కు చేరుకుంటుందని అంచనా వేసింది. ఇది అత్యంత వేగంగా చోటుచేసుకున్న మార్పు అని అభిప్రాయపడింది. భారత్ ఒక లో-ఇన్‌కమ్ దేశం నుంచి లోయర్ మిడిల్ ఇన్‌కమ్ దేశంగా మారేందుకు 60 తరువాయి 2 వ పేజీలో...

# భారత వృద్ధి.. 7.3%

**ఈ ఏడాదిలోనే సాధ్యం.. పెరుగుతున్న దేశీయ డిమాండ్**

**ఎగుమతుల నుంచి మద్దతు.. ఫలితంగా మెరుగైన ఆర్థిక వృద్ధి**

## మూడీఎస్ తాజా అంచనా





ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారతదేశ వృద్ధి రేటు 7.3 శాతంగా ఉంటుందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ అంచనా వేసింది. బలమైన ఆర్థిక విస్తరణ సగటు గృహ ఆదాయానికి మద్దతు ఇస్తుందని భావిస్తోంది, ఇది నేరుగా బీమా వంటి రంగాలపై ప్రభావం చూపుతుందని వెల్లడించింది.

న్యూఢిల్లీ: ఏజెన్సీ ప్రకారం, వేగవంతమైన వృద్ధి, పెరుగుతున్న డిజిటలైజేషన్, పన్ను సంస్కరణలు, ప్రభుత్వ యాజమాన్యంలోని బీమా కంపెనీలలో ప్రతిపాదిత మార్పులు బీమా ప్రీమియంలలో స్థిరమైన వృద్ధిని ప్రోత్సహి స్తాయి, ఇది పరిశ్రమ లాభదాయకతను కూడా మెరుగుప రుస్తుంది. కంపెనీలు పెట్టుబడులు పెట్టడం దగ్గరి నుంచి ఎక్కువ మందికి ఉపాధి లభించడం, ఆదాయాలు పెరగడం, ప్రజలు ఖర్చు చేసే ధోరణి సానుకూలంగా ఉండటం, బీమా రక్షణకు డిమాండ్‌ను పెరగడం వంటి అంశాలు మొత్తం దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడుతున్నాయని తరువాయి 2 వ పేజీలో...

# 'ధిక్కరణ'పై మీరేమంటారు?

## స్పీకర్‌కు సుప్రీం నోటీసులు

## ఫిబ్రవరి 6న విచారణ



తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేయడంతో.. సర్వోన్నత న్యాయస్థానం ఆ పిటిషన్ పై విచారణను వాయిదా వేసింది. అయితే మహేశ్వర్ రెడ్డి పిటిషన్‌పై సమాధానం చెప్పాలని స్పీకర్ కు నోటీసులు ఇచ్చింది.

న్యూఢిల్లీ: పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పును స్పీకర్ అమలు చేయలేదని ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిటిషన్ వేశారు. దాంతో సమాధానం చెప్పాలంటూ స్పీకర్ కు సంజయ్ కరోల్ ధర్మాసనం నోటీసులు ఇచ్చింది. అదేవిధంగా మహేశ్వర్ రెడ్డి పిటిషన్ ను పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్ పిటిషన్ లతో జత చేసింది. అన్ని పిటిషన్‌లపై కలిపి విచారణను ఫిబ్రవరి 6వకి వాయిదా వేసింది.

# ఫిబ్రవరి 20 లోపు చెప్పండి

**పీసీ ఘోశ్ కమిషన్ నివేదికపై హైకోర్టు**



హైదరాబాద్, జనవరి 19 (ఈవార్తలు): కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్ పై విచారణను తెలంగాణ హైకోర్టు ఫిబ్రవరి 25కు వాయిదా వేసింది. ఈ కిమిషన్ నివేదికను రద్దు చేయాలంటూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ సీఎస్ ఎస్కే జోషి, ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు సోమవారం కలిపి విచారించింది. కేసీఆర్, తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,624 |
| వెండి (గ్రాము): | రూ.318 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,848 |

# సంతోష్ ఆస్తులపై ఎంక్వైరీ!

**ఈడీకి రమ్యారావు విజ్ఞప్తి.. కీలక ఆధారాలు సమర్పణ**

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సోదరుడి కుమార్తె రమ్యారావు హైదరాబాద్ ఈడీ కార్యాలయం వద్ద ప్రత్యక్షమై సంచలనం రేపారు. మాజీ ఎంపీ సంతోష్ రావు భూ ఆక్రమణలపై విచారణ జరుపాలని కోరుతూ ఆమె ఈడీకి ఫిర్యాదు చేశారు.



హైదరాబాద్, జనవరి 19 (ఈవార్తలు): సంతోష్ రావు భూ కుంభకోణాలకు సంబంధించిన కీలక ఆధారాలను రమ్యరావు ఈడీకి సమర్పించారు. పోలీసులను, తాసీల్దార్ స్థాయి అధికారులను మేనేజ్ చేసుకుంటూ నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఆస్తులు ట్రాన్స్ ఫర్ చేసుకున్నారని ఆరోపించారు. అక్రమంగా తరువాయి 2 వ పేజీలో...



# హరీశ్‌కు సిట్ నోటీసులు

**ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిర్ణయం**

హైదరాబాద్ , జనవరి 19 (ఈవార్తలు): తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో సంచలనం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు సిట్ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో మంగళవారం జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ లో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో సిట్ పేర్కొంది. హరీశ్ ఇంట్లో లేని సమయంలో పోలీసులు నోటీసులు ఇచ్చినట్టు తెలిసింది. ఆయన కుటుంబ సభ్యులకు పోలీసులు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా కేసు విషయమై మంగళవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ లో విచారణకు రావాలని పేర్కొన్నారు. దీంతో, ఫోన్ ట్యాపింగ్ కేసు మరో టర్న్ తీసుకుంది. తన ఫోన్ ను ట్యాప్ చేయించారంటూ హరీశ్ రావుపై రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి




కార్బన్ డయాక్సైడ్ నుంచి స్టార్చ్‌ను తయారుచేసే వహ్వా అనిపించారు చైనా శాస్త్రవేత్తలు. అది కూడా ఎలాంటి సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను ఉపయోగించకుండానే. ప్రస్తుతం ల్యాబ్‌లో విజయవంతమైన ఈ ప్రయోగం.. రాబోయే రోజుల్లో ఆహార ఉత్పత్తి రంగంలో పెను మార్పులు తెస్తుందని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.



# కవితకు 'పీకే' స్ట్రాటజీ

## కొత్త పార్టీ ఏర్పాటుకు కవిత అడుగులు

**రంగంలోకి ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్.. పీకేతో కవిత వరుస సమావేశాలు**

రాజకీయ భవిష్యత్తుపై కల్వకుంట్ల కవిత పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు ప్రయత్నాలను ఆమె ముమ్మరం చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, కార్యాచరణ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) ఆమెకు సహాయం అందిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో తీవ్రమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది.

హైదరాబాద్, జనవరి 19 (ఈవార్తలు): రెండు నెలల వ్యవధిలో ప్రశాంత్ కిశోర్ రెండు సార్లు హైదరాబాద్ వచ్చి కవితతో రహస్యంగా సమావేశమయ్యారని సమాచారం. ఇటీవల సంక్రాంతి పండుగ సందర్భంగా కూడా వీరి మధ్య భేటీ జరిగినట్లు తెలుస్తోంది. కొత్త పార్టీని ప్రకటిస్తే రాజకీయ పరిస్థితులు ఎలా ఉంటాయి, పార్టీని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి, అనుసరించాల్సిన వ్యూహాలు - 2 వ పేజీలో...



# గద్దర్ అవార్డులకు అప్లై చేసుకోండి!

**గత ఏడాది విడుదలైన చిత్రాలకు వర్తింపు**

**సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెల్లడి**

హైదరాబాద్, జనవరి 19 (ఈవార్తలు): తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2025 కోసం దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ద్వారా సర్టిఫికేషన్ పొందిన చిత్రాలకు ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు ఉన్న అవార్డు విభాగాలకు తోడు ఈసారి కొత్త విభాగాలను కూడా ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. సామాజిక స్పృహను ప్రతిబింబించే చిత్రాలకు 'ఉత్తమ సామాజిక సందేశ చిత్రం' అవార్డు, ప్రత్యేక తరువాయి 2 వ పేజీలో...




## రాశి ఫలాలు
20.1.2026

మేషం: ఆదాయం అంతంత మాత్రంగా ఉంటుంది. ముఖ్యమైన వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. ఉద్యోగమున స్థానచలన సూచనలున్నవి. ఆప్తులతో మాట పట్టింపులుంటాయి. నూతన ఋణ ప్రయత్నాలు ఫలించవు. వ్యాపారాలలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు.

వృషభం: స్థిరాస్తి క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఆర్థిక పురోగతి కలుగుతుంది. పాత ఋణాలు తీర్చగలుగుతారు. అప్రయత్నంగా కొన్ని పనులు పూర్తవుతాయి. ఉద్యోగమున అధికారుల అనుగ్రహంతో ఉన్నత పదవులు పొందుతారు. కీలక వ్యవహారాలలో స్వంత ఆలోచనలు కలసివస్తాయి.

మిధునం: ఉద్యోగమున పని ఒత్తిడి ఉన్నప్పటికీ పనులు పూర్తి చేసి అధికారుల ప్రశంసలు అందుకుంటారు. వృత్తి వ్యాపారములలో నూతన ప్రణాళికలతో ముందుకు సాగుతారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. బంధు మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. సమాజంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి.

కర్కాటకం: గృహమున సంతాన శుభాకార్య విషయమై ప్రస్తావన వస్తుంది. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ఆదాయం ఆశించిన విధంగా ఉంటుంది. చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగమున సహోద్యోగులతో సహాయ సహకారాలు అందుతాయి.

సింహం: దీర్ఘకాలిక ఋణ ఒత్తిడి పెరుగుతుంది. చేపట్టిన పనులలో అధిక కష్టంతో అల్పఫలితం పొందుతారు. ఉద్యోగమున అదనపు బాధ్యతలు వలన మానసిక ఒత్తిడి పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులుంటాయి. వ్యాపారాలలో ఊహించని సమస్యలు కలుగుతాయి.

కన్య: నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన వ్యాపారాల ప్రారంభానికి శ్రీకారం చుడతారు. సన్నిహితుల సహాయంతో కొన్ని పనులు పూర్తి అవుతాయి. ధన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. స్థిరాస్తి క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి.

తుల: చేపట్టిన పనులలో ఆటంకాలు తొలగుతాయి. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుని లాభాలు అందుకుంటారు. ఉద్యోగ వాతావరణం ప్రశాంతగా ఉంటుంది. సన్నిహితులతో గృహమున ఆనందంగా గడుపుతారు. ఆదాయం పెరుగుతుంది. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

వృశ్చికం: అధికారులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఉద్యోగమున దైవ సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది. నిరుద్యోగుల ప్రయత్నాలు మందగిస్తాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. భాగస్వామ్య వ్యాపారాలలో అకారణ వివాదాలు కలుగుతాయి.

ధనస్సు: ఆకస్మిక ప్రయాణాల వలన శారీరక శ్రమ పెరుగుతుంది. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. సన్నిహితుల ప్రవర్తన కొంత ఆశ్చర్య పరుస్తుంది. మాతృ వర్గ బంధువుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. జీవిత భాగస్వామితో పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

మకరం: వృత్తి ఉద్యోగమున అధికారుల గుర్తింపు పెరుగుతుంది. చిన్ననాటి మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. వ్యాపార విస్తరణలో ఆటంకాలు తొలగుతాయి. గృహమున శు భకార్యములు నిర్వహిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలలో స్వంత నిర్ణయాలు కలసివస్తాయి.

కుంభం: బంధు మిత్రులతో మాటపట్టింపులు పెరుగుతాయి. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది. చేపట్టిన పనులలో స్వల్ప అవాంతరాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలు మందకోడిగా సాగుతాయి. రుణదాతల ఒత్తిడి పెరుగుతుంది. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి.

మీనం: నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. సన్నిహితుల నుండి కొన్ని ఆశ్చర్యకర విషయాలు తెలుస్తాయి. వృత్తి వ్యాపారమున నూతన ఆలోచనలు అమలు చేస్తారు. ఆర్థిక పురోగతి కలుగుతుంది. పాత మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన వ్యవహారాలు సజావుగా సాగుతాయి.




# మనమూ.. ఉన్నోళ్లమే!

మొదటి పేజీ తరువాయి

సంవత్సరాలు పట్టిందని వివరించింది. దేశంలో 1962లో తలసరి ఆదాయం 90 డాలర్లు ఉంటే.. 2007కు 910 డాలర్లకు పెరిగింది. కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్ 5.3 శాతంగా ఉంది. ఈ 60 ఏళ్లలో భారత్ 1 ట్రిలియన్ డాలర్ల జీడీపీని కూడా సాధించింది. గత పది సంవత్సరాల్లో భారత్ వృద్ధి ప్రయాణం మరింత వేగం పుంజుకుందని, తద్వారా దేశాల మధ్య సగటు వాస్తవ జీడీపీ పంపిణీలో భారత్ స్థానం 92 నుంచి 95వ స్థానానికి పెరిగిందని తెలిపింది. ఎస్బీఐ నివేదిక ప్రకారం.. 2047 నాటికి భారత్ హై ఇన్ కమ్ దేశంగా మారే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం హై ఇన్ కమ్ దేశాల్లో తలసరి ఆదాయం 13,936 డాలర్లుగా ఉంది. ఈ స్థాయికి భారత్ 2047 నాటికి చేరాలంటే ప్రతి వ్యక్తి గ్రాస్ నేషనల్ ఇన్‌కం 7.5 శాతం సీఏజీఆర్‌తో పెరగాల్సి ఉంటుంది. గత 23 సంవత్సరాల్లో భారత్ జీఎన్ఐ ఇప్పటికే 8.3 శాతం సీఏజీఆర్‌తో పెరిగినందున ఈ లక్ష్యం సాధ్యమేనని నివేదిక అంచనా వేసింది. అయితే.. 2047 నాటికి హై-ఇన్‌కమ్ దేశాల పరిమితి మారే అవకాశం ఉందని కూడా హెచ్చరించింది. ఆ పరిమితి 18,000 డాలర్లకు పెరిగితే, భారత్ హై-ఇన్‌కమ్ దేశంగా మారాలంటే వచ్చే 23 సంవత్సరాల్లో వ్యక్తి జీఎన్ఐ సుమారు 8.9 శాతం సీఏజీఆర్‌తో పెరగాల్సి ఉంటుందని నివేదిక స్పష్టం చేసింది. భారతదేశ ఆర్థికంలో వేగం పెరిగింది. స్వాతంత్ర్యం తరువాత మన దేశం ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడానికి దాదాపు ఆరు దశాబ్దాలు పట్టింది, కానీ, 2014 నాటికి రెండు ట్రిలియన్ డాలర్లు, 2021 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లు, తర్వాత కేవలం 4 సంవత్సరాల్లో 2025 నాటికి బ్రిటన్‌ను అధిగమించి నాలుగు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారింది. దీనితోపాటు, భారతదేశం ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. ప్రస్తుత అంచనాల ప్రకారం, 2027 నాటికి భారతదేశ ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్ల మార్కును అందుకొనే అవకాశాలు ఉ న్నాయి. తలసరి ఆదాయం విషయంలో కూడా ఇదే ధోరణి కనిపిస్తుంది. 2009 నాటికి భారతదేశ తలసరి ఆదాయం 1,000 డాలర్లకు చేరుకుంది. 2019 నాటికి, ఇది రెట్టింపు అయ్యి 2,000 డాలర్లకు చేరుకుంది. 2026 నాటికి ఇది 3,000 డాలర్లకు పెరుగుతుందని అంచనా.

# సంతోష్ ఆస్తులపై ఎంక్వైరీ!

మొదటి పేజీ తరువాయి



భూదందాలు చేస్తూ వాటిలో వచ్చిన డబ్బును లిక్కర్ స్కామ్ లో పెట్టారని ఆరోపించారు. సంతోష్ రావు ఆస్తులపై లోతైన దర్యాప్తు చేయాలని ఆమె తన ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. రెండు మూడు రోజుల్లో మరోసారి మీడియా సమావేశం ఏర్పాటు చేసి సంతోష్ రావు అవినీతి బాగోతం మొత్తం వివరిస్తానని రమ్యారావు తెలిపారు. ఇప్పటికే సీబీఐ, ఏసీబీకి ఫిర్యాదు చేశామని ఇప్పుడు ఈడీకి ఫిర్యాదు చేశామన్నారు. రమ్యారావు 2007లో ఎలగందులలో తాను కొనుగోలు చేసిన రెండెకరాల భూమిని సంతోష్ ఆక్రమించారని, అందులో గ్రానైట్ వ్యర్థాలు వేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2009లో రూ. 7కోట్ల ఆస్తులున్న సంతోష్.. 2013లో గ్రానైట్ క్వారీ భాగస్వామ్య తీసుకుని అనేక భూకబ్జాలకు పాల్పడుతున్నారని మీడియా సమావేశాల్లో ఆరోపించారు. 2015లో మిడ్ మానేర్ ముంపు బాధితుడిగా 2 గుంటల పట్టా భూమి అందుకున్న సంతోష్ కు కోకాపేట వంటి ఖరీదైన ప్రాంతాల్లో 200 ఎకరాలు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. 10 ఏళ్ల కేసీఆర్ దొర పాలనలో వేల కోట్ల రూపాయలు దోచేసిన సంతోష్ రావు.. అమెరికాలో జేఎస్ రాంచ్ పేరిట 1000ఎకరాల భూములకు యజమానిగా మారారని ఆరోపించారు. గూగుల్ లో సెర్చ్ చేస్తే దాని వివరాలు కూడా తెలుసుకోవచ్చంటూ రమ్యారావు ఆరోపణలు చేశారు. తాజాగా మరోసారి సంతోష్ రావుపై రమ్యారావు ఫిర్యాదు చేయడం గమనార్హం.



# హరీశ్‌కు సిట్ నోటీసులు


మొదటి పేజీ తరువాయి

పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎఫ్ ఐఆర్ కూడా నమోదు అయ్యింది. దీన్ని సవాల్ చేస్తూ హరీశ్.. తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, సరైన ఆధారాలు లేనందున ఈ కేసును కొట్టివేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సుప్రీంలో విచారణ జరగ్గా.. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోబోమని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఇప్పుడు సిట్ నోటీసులు ఇవ్వడం ఆసక్తి రేపుతోంది.

# భారత వృద్ధి.. 7.3%

మొదటి పేజీ తరువాయి

అభిప్రాయపడింది. అంతేకాకుండా దేశంలో వేగంగా పెరుగుతున్న డిజిటల్ వినియోగం, ప్రభుత్వం చేపడుతున్న పన్ను, బీమా రంగ సంస్కరణలు దోహదపడుతున్నాయి. ఇదే సమయంలో భారత్‌కు ఎగుమతుల నుంచి మాత్రమే వృద్ధికి మద్దతు లభించడం లేదు, దేశీయ డిమాండ్ వృద్ధికి ప్రధాన కారణమని నివేదిక వెల్లడించింది. గతేడాదిలో 6.5 శాతం నుంచి ఈసారి 7.3 శాతం భారత వృద్ధి ఉంటుందని భావిస్తు న్నాం. అధిక వృద్ధి కొనసాగడం వల్ల దేశంలో సగటు ఆదాయం పెరుగుతుంది. ఎక్కువ మంది ఆరోగ్యం, జీవితం, పొదుపు కోసం బీమా పాలసీలను కొనవచ్చని తెలిపింది. ఫలితంగా రా నున్న రోజుల్లో దేశ బీమా రంగం ఎక్కువ ప్రయోజనం పొందన ుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొదటి ఎనిమిది నెలలు మొత్తం బీమా ప్రీమియం ఆదాయం 17 శాతం పెరిగి రూ. 10.9 లక్షల కోట్లకు చేరింది. ఆరోగ్య బీమా ప్రీమియంలు 14 శాతం, కొత్త జీవిత బీమా వ్యాపారం 20 శాతం పెరగడమే ఇందుకు కారణం. దేశంలో బీమాకు డిమాండ్ పెరుగుతోంది. ప్రజలు ఆరోగ్యం, ఆర్థిక నష్టాల గురించి ఎక్కువ అవగాహన ఆశిస్తున్నారు. డిజిటలైజేషన్ బీమా కొనుగోలును సులభతరం, వేగవంతం చేసిందని నివేదిక పేర్కొంది.



# గద్దర్ అవార్డులకు అప్లై చేసుకోండి!

మొదటి పేజీ తరువాయి

విభాగంలో డాక్టర్ సీనారాయణరెడ్డి అవార్డులను అందజేస్తామని చెప్పారు. అర్హులైన నిర్మాతలు, ఇతర దరఖాస్తుదారులు అవార్డులకు సంబంధించిన దరఖాస్తు పత్రాలు, మార్గదర్శకాలను జనవరి 31, 2026 వరకు పొందవచ్చని, ఎంట్రీల సమర్పణకు ఫిబ్రవరి 3, 2026 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. నిర్దేశిత మార్గదర్శకాలను పాటిస్తూ నిర్ణీత గడువులోపే దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.



# ఫిబ్రవరి 20 లోపు చెప్పండి

మొదటి పేజీ తరువాయి

హరీశ్‌రావు తరపున సుప్రీం కోర్టు సీనియర్ కౌన్సిల్ సుందరం వాదనలు వినిపించారు. ఈ పిటిషన్లపై ఇప్పటికే ప్రభుత్వం ఇప్పటికే కౌంటర్ దాఖలు చేయగా ప్రభుత్వ కౌంటర్‌కు పిటిషనర్లు రిప్లయ్ దాఖలు చేశారు. అయితే పిటిషనర్ల రిప్లయ్‌పై ప్రభుత్వం తరపున లిఖితపూర్వక సబ్‌మిషన్లు దాఖలు చేసేందుకు సమయం కావాలని అడ్వకేట్ జనరల్ హైకోర్టును కోరారు. దీంతో ఫిబ్రవరి 20 లోపు లిఖితపూర్వక సబ్మిషన్ చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణ ఫిబ్రవరి 25 కు వాయిదా వేసింది. అప్పటి వరకు పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ఎలాంటి చర్యలు తీసువద్దని హై కోర్టు స్పష్టం చేసింది.



# కవితకు 'పీకే' స్ట్రాటజీ

మొదటి పేజీ తరువాయి

వంటి కీలక అంశాలపై వీరిద్దరి మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ సమావేశాలపై కవిత గానీ, తెలంగాణ జాగృతి ప్రతినిధులు గానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం. మరోవైపు తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేందుకే కొత్త పార్టీ అవసరమని కవిత బలంగా వాదిస్తున్నారు. తన సారథ్యంలోని 'తెలంగాణ జాగృతి'ని రాజకీయ శక్తిగా మార్చి, 2029 ఎన్నికల్లో ప్రజల పక్షాన పోటీ చేస్తామని ఆమె ఇప్పటికే స్పష్టం చేశారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో పార్టీ విధివిధానాల రూపకల్పనకు దాదాపు 50 కమిటీలతో అధ్యయనం చేయిస్తున్నారు. అదే సమయంలో మైనార్టీలు, బీసీలు, యువత తనతో కలిసి రావాలని, తన 'తెలంగాణ సెక్యులర్ పార్టీ'కి మద్దతివ్వాలని పిలుపునిస్తున్నారు. గతంలో ఏపీలో వైఎస్ జగన్‌కు, 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్‌కు, వ్యూహకర్తగా పనిచేశారు. తమిళనాడులో నటుడు విజయ్ పార్టీకి కూడా సేవలు అందిస్తున్నారు. ఇప్పుడు కవితతో జతకట్టడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవైపు కవిత క్షేత్రస్థాయి సన్నాహాలు, మరోవైపు పీకే వ్యూహాత్మక మార్గదర్శకత్వంతో త్వరలోనే కొత్త పార్టీ ప్రకటన ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.




# మూడు రోజులు ఆడిట్ వర్క్‌షాప్

### ఎన్ఐఆర్డీపీఆర్‌లో ప్రారంభం

హైదరాబాద్, జనవరి 19 (పీఐబీ): స్థానిక నిధుల ఆడిట్ (ఎలచవతీతీచఫచవతీతీచ) డైరెక్టరేట్లు, రాష్ట్ర ఆడిట్ విభాగాలకు మూడు రోజుల జాతీయ వర్క్‌షాప్ హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ సంస్థ (ఎన్ఐఆర్డీపీఆర్)లో సోమవారం ప్రారంభమైంది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) మార్గనిర్దేశంలో, అంతర్జాతీయ స్థానిక సంస్థల ఆడిట్ ఆడిట్ కేంద్రం (ఐసీఏఎల్) సహకారంతో.. గ్రామీణాభివృద్ధిలో అంతర్గత ఆడిట్ కేంద్రం (సీఐఏఆర్డీ), ఎన్ఐఆర్డీపీఆర్ ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నాయి. ఈ నెల 21 వరకు ఈ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. రాష్ట్ర, స్థానిక నిధుల ఆడిట్ విభాగాల సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, అలాగే దేశవ్యాప్తంగా పంచాయతీ రాజ్ సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల్లో ఆడిట్ వ్యవస్థల ప్రభావం, ఏకరూపత, పనితీరును మెరుగుపరచడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. కార్యక్రమం ప్రారంభం సందర్భంగా ఎన్ఐఆర్డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి. నరేంద్ర కుమార్ స్వాగతోపన్యాసం చేశారు. పదిహేనో ఆర్థిక సంఘం ద్వారా స్థానిక సంస్థలకు నిధుల ప్రవాహం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో.. స్థానిక ప్రభుత్వాల్లో జవాబుదారీతనం, పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణను బలోపేతం చేయడంలో స్థానిక నిధుల ఆడిటర్లు, రాష్ట్ర ఆడిట్ విభాగాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తారని ఆయన స్పష్టం చేశారు. సామర్థ్యాలను పెంపొందించడం, రాష్ట్రాల మధ్య పరస్పర అభ్యసన వినిమయం, ఐటీ, కృత్రిమ మేధ, శాట్స్ (సీఏఏటీఎస్) వంటి అధునాతన సాంకేతికతలను అవలంబించడం ద్వారా.. ఆడిటింగ్ సవాళ్లను అధిగమించవచ్చని డైరెక్టర్ జనరల్ వివరించారు. స్థానిక సంస్థల ఆడిట్ వ్యవస్థలను బలోపేతం చేయడంలో రాష్ట్రాలకు అవసరమైన పూర్తి మద్దతును అందించడానికి ఎన్ఐఆర్డీపీఆర్ కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. డిప్యూటీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (స్థానిక సంస్థల ఆడిట్) మనీశ్ కుమార్ మాట్లాడుతూ.. పంచాయతీ రాజ్ సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల్లో ఆడిటింగ్ ప్రక్రియ రాజ్యాంగపరమైన బాధ్యత అని గుర్తు చేశారు. స్థానిక సంస్థల పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో స్థానిక నిదుల ఆడిట్ అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వికేంద్రీకరణను బలోపేతం చేయడంలోనూ, స్థానిక ప్రభుత్వాల్లో ఆర్థిక క్రమశిక్షణను పెంపొందించడంలోనూ పటిష్టమైన ఆడిట్ వ్యవస్థల ప్రాధాన్యాన్ని పంచాయతీ రాజ్ శాఖ అదనపు కార్యదర్శి సుశీల్ కుమార్ లోహాని వివరించారు. రాష్ట్ర, స్థానిక నిధుల ఆడిట్ సంస్థల వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంపొందించడంలోనూ.. దేశవ్యాప్తంగా స్థానిక పరిపాలనలో ఏకరీతి, సాంకేతిక ఆధారిత–ఫలితాల ప్రాతిపదికన ఆడిట్ పద్ధతులను ప్రోత్సహించడంలోనూ ఈ వర్క్‌షాప్ ప్రాధాన్యాన్ని ఐసీఏఎల్ డైరెక్టర్ జనరల్ హెచ్.కె. ధర్మదర్శి వివరించారు. వర్క్‌షాప్‌ను పరిచయం చేస్తూ.. సీఐఏఆర్డీ హెడ్ (ఇన్చార్జి), కోర్సు డైరెక్టర్ డాక్టర్ యు. హేమంత కుమార్ మాట్లాడుతూ... గత వర్క్‌షాప్‌ల అభ్యసన ఫలితాలను ఏకీకృతం చేయడం, రాష్ట్రాల వారీగా అత్యుత్తమ పద్ధతులు, సవాళ్లను క్షుణ్ణంగా పరిశీలించడం, దేశవ్యాప్తంగా పంచాయతీ రాజ్ సంస్థల ఆడిట్ వ్యవస్థలను బలోపేతం చేసేందుకు అవసరమైన ఆచరణాత్మక వ్యూహాలను రూపొందించడం ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ప్లీనరీ సెషన్లతో పాటు.. స్థానిక ప్రభుత్వాల అకౌంటింగ్, ఆడిట్ ప్రక్రియల ప్రామాణీకరణ, ఆడిట్‌లో గుర్తించిన సమస్యల పరిష్కారం, ఆడిటింగ్‌లో అత్యాధునిక సాంకేతికత, వినూత్న సాధనాల వినియోగం వంటి అంశాలపై బృంద చర్చలు నిర్వహించనున్నారు. వివిధ రాష్ట్రాల ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరళ్లు, అకౌంటెంట్ జనరళ్లు.. పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ, ఎన్ఐఆర్డీపీఆర్, ఐసీఏఎల్ సీనియర్ అధికారులు, నిపుణులు.. రాష్ట్ర ఆడిట్, స్థానిక నిధుల ఆడిట్ విభాగాల డైరెక్టర్లు/ప్రతినిధులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొంటున్నారు. స్థానిక నిధుల ఆడిట్ సంస్థాగత యంత్రాంగాన్నీ, వృత్తిపరమైన సామర్థ్యాన్నీ బలోపేతం చేయడానికి.. తద్వారా దేశంలో స్థానిక పరిపాలనను మెరుగుపరచడానికి ఈ చర్చలు బలమైన సూచనలను అందిస్తాయని ఆశిస్తున్నారు.



# హరీశ్‌ను ఎదుర్కోలేక కక్ష సాధింపు

### సిట్ నోటీసులపై కేటీఆర్ మండిపాటు

హైదరాబాద్, జనవరి 19 (ఈవార్తలు): ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు సిట్ నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. హరీశ్ రావును ఎదుర్కోలేక ఆయనపై తప్పుడు కేసులు పెట్టి నోటీసులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాజకీయ వేధింపులే కాంగ్రెస్ పార్టీ ఏకైక అజెండాగా మారిపోయిందని ఆయన విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి పస లేదని, అది కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యేనని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందని, ఆ కేసును కొట్టివేసిందని ఆయన గుర్తు చేశారు. సుప్రీంకోర్టు తీర్పుతోనే ఫోన్ ట్యాపింగ్ కేసు డ్రామా ముగిసిపోయిందని, అయినప్పటికీ మళ్లీ హరీశ్ రావుకు నోటీసులు ఇవ్వడం చూస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏ స్థాయికి దిగజారిందో అర్థమవుతోందని ఆయన మండిపడ్డారు. రేవంత్ రెడ్డి బావమరిది సుజన్ రెడ్డికి బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణాన్ని బయటపెట్టినందుకే, దాని నుంచి ప్రజల దృష్టిని మళ్లించే 'డైవర్షన్ పాలిటిక్స్'కు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. హరీశ్ రావు తెలంగాణ ఉద్యమం నుంచి నేటి వరకు ప్రజల కష్టాల్లో తోడున్న నాయకుడని ఆయన కొనియాడారు. అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో కానీ, క్షేత్రస్థాయిలో ప్రజల పక్షాన నిలబడటంలో కానీ ఆయన చూపిస్తున్న చొరవను చూసి రేవంత్ రెడ్డికి వణుకు పుడుతోందని ఆయన అన్నారు. అందుకే రాజకీయంగా ఎదుర్కోలేక, ఇలాంటి తప్పుడు కేసులతో ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని అన్నారు. గత 24 నెలలుగా రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఈ దారుణమైన పాలనను నిలదీస్తున్నందుకే హరీశ్ రావును లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. తమకు చట్టంపై, న్యాయస్థానాలపై పూర్తి గౌరవం ఉందని, అందుకే ఏ విచారణకైనా సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు. కానీ విచారణల పేరుతో, నోటీసులతో ప్రతిపక్ష గొంతు నొక్కాలని భావిస్తే అది భ్రమే అవుతుందని అన్నారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా, ఎన్ని వేధింపులకు గురిచేసినా ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని తెలిపారు. ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని, అడుగడుగునా ప్రశ్నిస్తుంటామని అన్నారు. ఇలాంటి చౌకబారు బెదిరింపులకు తమ పార్టీ భయపడదని ఆయన స్పష్టం చేశారు.

# రౌడీలా రేవంత్ పిలుపు

### దాసోజు శ్రవణ్ మండిపాటు



హైదరాబాద్, జనవరి 19 (ఈవార్తలు): బీఆర్ఎస్ దిమ్మెలను కూల్చివేయాలంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు పిలుపునివ్వడం రెండు పార్టీల మధ్య వైషమ్యాలకు దారితీస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాలో చేసిన వ్యాఖ్యలపై ఆయన అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారని అన్నారు. రేవంత్ రెడ్డిపై కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని పోలీసులను కోరినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు రెండు పార్టీల మధ్య గొడవలకు, వైషమ్యాలకు దారి తీస్తాయని అన్నారు. ముక్కలు అవుతారని అన్నందుకే తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై కేసు పెట్టారని, మరి కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను బొంద పెట్టాలన్న రేవంత్ రెడ్డిపై కేసు పెట్టకూడదా అని ప్రశ్నించారు. నిన్న ఖమ్మం జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా మాట్లాడారని మండిపడ్డారు. నిరంతర పోరాటంతో తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను, తెలంగాణ సాధన కోసమే పుట్టిన బీఆర్ఎస్ ను 100 మీటర్ల లోతున బొంద పెట్టాలని పిలుపునివ్వడం విడ్డూరమని అన్నారు. తెలంగాణకు ద్రోహం చేసిన, 1,200 మంది ఉద్యమకారులను బలితీసుకున్న తెలుగుదేశం పార్టీ ఇక్కడ బతికి బట్టకట్టాలని ఆయన కోరుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ కోసం పుట్టిన బీఆర్ఎస్, కేసీఆర్ ఉండకూడదా అని నిలదీశారు. రేవంత్ రెడ్డి మాట్లాడింది మనుషులు మాట్లాడే భాషనా, రాక్షసుల భాషనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజంలో అశాంతి రెచ్చగొట్టేలా మాట్లాడిన రేవంత్ రెడ్డిపై సుమోటోగా కేసు పెట్టాలని కోరామని అన్నారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తెలంగాణ సమాజం ఆలోచన చేయాలని అన్నారు. "బీఆర్ఎస్ పార్టీ దిమ్మెలను తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కలిసి తొలగించాలని ఒక రౌడీ మాదిరిగా పిలుపునిచ్చారు. అలా పిలుపునివ్వడం ద్వారా బీఆర్ఎస్, టీడీపీల మధ్య, ఇరు పార్టీల కార్యకర్తల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా, హింసాయుత వాతావరణం ప్రేరేపించేలా కలుషితమైన తెలంగాణ సమాజాన్ని తయారు చేయడం కోసం ఆయన మాట్లాడిన మాటలు దారుణం. కంచె చేను మేసినట్లుగా ఆయన అలా మాట్లాడటం దుర్మార్గం, శోచనీయం. ఒక ముఖ్యమంత్రి ముఠా నాయకుడిలా మాట్లాడటం భారతదేశంలో ఎవరూ మాట్లాడి ఉండకపోవచ్చు. కానీ రాహుల్ గాంధీ పుణ్యమా అని తెలంగాణ పాలిట శాపంగా రేవంత్ రెడ్డి మారారు. తన నోటికి అడ్డూ అదుపు లేకుండా మాట్లాడుతున్నారు" అని తీవ్రంగా విమర్శించారు.

# మేడారం జాతరకు ఏఐ సొబగులు

### డ్రోన్లు, జియో ట్యాగ్‌లతో హైటెక్ నిఘా



మేడారం, జనవరి 19 (ఈవార్తలు): దక్షిణ భారత కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర ఈసారి ఆధునిక సాంకేతిక హంగులతో జరగనుంది. ఈ నెల 28 నుంచి 31 వరకు జరిగే ఈ చారిత్రక ఘట్టానికి తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ మునుపెన్నడూ లేనివిధంగా కృత్రిమ మేధ ఆధారిత భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాయి. జాతర ఏర్పాట్లపై సీఎం రేవంత్ రెడ్డి నిన్న ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా భద్రతా వ్యవస్థ పనితీరును పరిశీలించారు. జాతర భద్రత కోసం 'మేడారం 2.0' పేరుతో అత్యాధునిక సాంకేతికతను ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా 'టీజీ-క్వెస్ట్' అనే ఏఐ డ్రోన్ వ్యవస్థను వినియోగిస్తున్నారు. ఇవి దాదాపు 30 చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతం, జంపన్నవాగు, రద్దీ మార్గాలపై గగనతలం నుంచి నిరంతరం నిఘా ఉంచుతాయి. వీటితో పాటు ఆకాశంలో ఎగిరే హీలియం బెలూన్లకు పాన్-టిల్ట్-జూమ్ కెమెరాలను అమర్చారు. ఇవి అత్యంత ఎత్తు నుంచి జనసమూహాన్ని విశ్లేషించి, తొక్కిసలాట జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి కంట్రోల్ రూమ్‌ను అప్రమత్తం చేస్తాయి. ఈ హైటెక్ నిఘా నీడలో సుమారు 13 వేల మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. గత జాతరలో వేలాది మంది తప్పిపోయిన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి వొడాఫోన్-ఐడియా సహకారంతో 'జియోట్యాగ్ బేస్డ్ మిస్సింగ్ పర్సన్స్ ట్రాకింగ్' విధానాన్ని అమలు చేస్తున్నారు. పస్రా, తాడ్వాయి మార్గాల్లోని కౌంటర్ల వద్ద వృద్ధులు, పిల్లల వివరాలు నమోదు చేసి, వారికి క్యూఆర్ కోడ్ ఉండే జియోట్యాగ్‌ను చేతికి కడతారు. ఒకవేళ వారు తప్పిపోతే, ఈ ట్యాగ్‌ను స్కాన్ చేయడం ద్వారా వారి వివరాలు సులభంగా తెలుసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించవచ్చు. శబరిమలలో విజయవంతమైన ఈ విధానాన్ని ఇప్పుడు మేడారంలోనూ అమలు చేస్తున్నారు. జాతరలో నేరగాళ్లను గుర్తించేందుకు ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీని కూడా వాడుతున్నారు. ఆసుపత్రి, పార్కింగ్ స్థలాల వంటి కీలక ప్రదేశాల్లో పాత నేరస్థుల కదలికలను ఈ సాంకేతికత ద్వారా పసిగడతారు. అనుమానాస్పద వస్తువులను గుర్తించేందుకు రియల్-టైమ్ అలర్ట్ సిస్టమ్ సైతం పనిచేస్తుంది. భక్తుల సౌకర్యం కోసం 2,000 ఎకరాల్లో 37 పార్కింగ్ ప్రదేశాలు, 50కి పైగా అనౌన్స్‌మెంట్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.



# సిరిసిల్ల పవర్‌లూం క్లస్టర్ ఇంకెప్పుడు

### ఏర్పాటులో జాప్యంపై కేటీఆర్ అసహనం

### కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు లేఖ

సిరిసిల్ల, జనవరి 19 (ఈవార్తలు): సిరిసిల్ల మెగా పవర్ లూమ్ క్లస్టర్ మంజూరులో కేంద్ర ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు లేఖ రాశారు. ఇది కేవలం నిర్లక్ష్యం కాదని, తెలంగాణపై ఉద్దేశపూర్వక వివక్షేనని లేఖలో ఆయన ఆరోపించారు. సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్ కావాలన్న డిమాండ్ నిన్న మొన్నటిది కాదని, దీనిపై పదేళ్లుగా నిరంతరం పోరాడుతున్నామని గుర్తు చేశారు. కేంద్ర బృందాలే అన్ని అర్హతలు ఉన్నాయని నిర్ధారించినా ఫైళ్లను పక్కన పెట్టడమేంటని ప్రశ్నించారు. సిరిసిల్ల తెలంగాణ వస్త్ర పరిశ్రమకు గుండెకాయ లాంటిదని, ఈ ప్రాంతం 30 వేలకు పైగా పవర్ లూమ్స్‌తో వేలాది కుటుంబాల జీవనాధారమని కేటీఆర్ తెలిపారు. తక్కువ సామర్థ్యం ఉన్న ప్రాంతాలకు క్లస్టర్లు ఇచ్చి, సిరిసిల్లను విస్మరించడం ప్రాంతీయ వివక్షకు నిదర్శనమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవసరమైన భూమి, విద్యుత్, నీరు, అనుమతులు అన్నీ సిద్ధం చేసిందని గుర్తుచేశారు. 'మేక్ ఇన్ ఇండియా' అంటూ నినాదాలు ఇచ్చే కేంద్రం, నిజంగా సామర్థ్యం ఉన్న సిరిసిల్లకు మద్దతు ఇవ్వకపోవడం ద్వంద్వ నీతేనన్నారు. వచ్చే కేంద్ర బడ్జెట్‌లోనైనా సిరిసిల్ల మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను ప్రకటించి పదేళ్ల అన్యాయానికి ముగింపు పలకాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# 2,500 మందితో వందేమాతరం ప్రదర్శన

### కీరవాణిని అభినందించిన బండి సంజయ్



హైదరాబాద్, జనవరి 19 (ఈవార్తలు): ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అభినందనలు తెలిపారు. గణతంత్ర దినోత్సవ పరేడ్ కోసం కీరవాణి స్వరాలు సమకూర్చడం ఒక చరిత్రాత్మక ఘట్టమని ఆయన అభివర్ణించారు. వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 2,500 మంది కళాకారులతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేస్తుండడం నిజంగా అద్భుతమని బండి సంజయ్ కొనియాడారు. సంగీతం, జాతీయ స్ఫూర్తి, ప్రతిష్ఠ అన్నీ కలగలిసిన ఈ కార్యక్రమం దేశానికి ఒక చారిత్రక నివాళి అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈనెల 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో భాగంగా, కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక ప్రదర్శన జరగనుంది. భారత స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిల్చిన 'వందేమాతరం' గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 2,500 మంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొననుండగా, దీనికి కీరవాణి సంగీతాన్ని సమకూర్చారు. ఈ అరుదైన అవకాశంపై కీరవాణి కూడా స్పందించారు. "వందేమాతరం! చరిత్రాత్మక గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా, జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు సంగీతం సమకూర్చే గౌరవం నాకు దక్కింది. ఇది నాకెంతో సంతోషాన్ని కలిగిస్తోంది. దేశ స్ఫూర్తిని చాటే ఈ కార్యక్రమాన్ని అందరూ వీక్షించాలి" అని ఆయన తన సోషల్ మీడియాలో తెలిపారు. ఈ అపురూప ఘట్టం కోసం దేశవ్యాప్తంగా సంగీత ప్రియులు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# డీజీపీ ఖాకీ బుక్ కాకి ఎత్తుకుపోయిందా

### కాంగ్రెస్ నేతలపై వస్తున్న ఆరోపణలపై మౌనమేల

### జర్నలిస్టులు, బీఆర్ఎస్ నేతలపై మాత్రం సిట్‌లు

### మాజీమంత్రి హరీశ్ రావు మండిపాటు

హైదరాబాద్, జనవరి 19 (ఈవార్తలు): కాంగ్రెస్ నేతలపై వస్తున్న ఆరోపణలపై పోలీసులు మౌనం పాటించడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు తీవ్రంగా తప్పుబట్టారు. చట్టం అందరికీ సమానమని చెబుతూ నీతులు చెప్పే డీజీపీ శివధర్‌రెడ్డి ఖాకీ బుక్ ఇప్పుడు ఎక్కడికెళ్లిందని ఎద్దేవా చేశారు. "ఖాకీ బుక్‌ను కాకి ఎత్తుకుపోయిందా" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అలంపూర్‌లో సీఎం రేవంత్ రెడ్డికి సన్నిహితుడైన ఏఐసీసీ నేత, ఎమ్మెల్యే సంపత్‌కుమార్ కాంట్రాక్టర్లను రూ.8 కోట్లు ఇవ్వాలని బెదిరించాడని ఆరోపించారు. ఈ వ్యవహారంలో స్వయంగా బాధిత కాంట్రాక్టరే ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. ఈ కేసులో సిట్ ఎందుకు వేయలేదని నిలదీశారు. జర్నలిస్టులు, బీఆర్ఎస్ నేతలపై మాత్రం సిట్‌లు, కమిషన్లు వేస్తారని, కాంగ్రెస్ నేతల విషయంలో ఎందుకు నిబంధనలు మారతాయని హరీశ్‌రావు మండిపడ్డారు. జర్నలిస్టుల కేసులో సిట్ ఏర్పాటు సీఎం రేవంత్ రెడ్డికి తెలియదని చెబుతున్నారని, అదే నిజమైతే ఆయన ముఖ్యమంత్రిగా పూర్తిగా విఫలమైనట్టే అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర పరిపాలన బాధ్యత వహించే సీఎం ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చట్టాన్ని రాజకీయాల కోసం వాడితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హరీశ్‌రావు హెచ్చరించారు.

# సర్కారు బడికి తాళం!

### బిల్లులు చెల్లించలేదని కాంట్రాక్టర్ నిర్ణయం

నాగర్ కర్నూల్, జనవరి 19 (ఈవార్తలు): 'మన ఊరు-మన బడి' పథకం కింద నిర్మించిన పాఠశాల భవనానికి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఓ కాంట్రాక్టర్ దానికి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... సురేశ్ అనే కాంట్రాక్టర్ 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా రెండేళ్ల క్రితం ప్రభుత్వ పాఠశాల భవనాన్ని నిర్మించారు. అయితే, ఇప్పటివరకు ప్రభుత్వం బిల్లులు విడుదల చేయలేదని ఆయన ఆరోపించారు. లక్షల రూపాయల అప్పులకు వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా పాఠశాల భవనానికి తాళం వేశారు. వెంటనే బిల్లులు చెల్లించి తమను ఆదుకోవాలని సురేశ్ డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ గేటుకు తాళం వేయడంతో పాఠశాలకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడ్డారు.



## వడివడిగా రాజన్న ఆలయ పునర్నిర్మాణం

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా రాజన్న ఆలయంలో నిర్మాణంలో ఉన్న మహామండపం రాఫ్టింగ్ ఫౌండేషన్ పనులను విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. నిర్దేశిత గడువులోపు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.




## అనతి కాలంలోనే వైవిధ్య కథనాలు

**ప్రజలకు ఉపయోగపడే సమాచారం**

**రాబోయే రోజుల్లో మరింత ఎదగాలి**

**'ఈవార్తలు' దినపత్రికకు మంత్రి రాజనర్సింహ కితాబు**

**మినిస్టర్ క్వార్టర్స్‌లో క్యాలెండర్ ఆవిష్కరణ**

బంజారాహిల్స్/హైదరాబాద్, జనవరి 19 (ఈవార్తలు): 'ఈవార్తలు' దినపత్రిక ప్రారంభించిన అతి తక్కువ కాలంలోనే గొప్పగా కథనాలు అందిస్తోందని, పాఠకుల అభిరుచికి తగ్గట్లుగా గొప్ప సమాచారం అందిస్తోందని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో జరిగిన 'ఈవార్తలు' 2026 క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో పత్రిక మరింత గొప్పగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాలని, ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మినిస్టర్ పీఆర్వో డేగ కుమార్, 'ఈవార్తలు' దినపత్రిక ఎడిటర్ బొమ్మకంటి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.



## రథసప్తమికి తిరుమలలో విస్తృత ఏర్పాట్లు

**ఏడు వేర్వేరు వాహనాలపై విహరించనున్న వేంకటేశ్వర స్వామి**

తిరుమల, జనవరి 19 (ఈవార్తలు): తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక రథసప్తమి ఉత్సవాలకు టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సకల జీవకోటికి వెలుగునిచ్చే సూర్య భగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఒకే రోజులో స్వామివారు ఏడు వేర్వేరు వాహనాలపై మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వడం ఈ పర్వదినం యొక్క ప్రధాన ప్రత్యేకత. అందుకే రథసప్తమిని 'అర్ధ బ్రహ్మోత్సవం'గా కూడా పిలుస్తారు. ఉత్సవాలు తెల్లవారుజామున సూర్యోదయ వేళ సూర్యప్రభ వాహన సేవతో ప్రారంభమవుతాయి. అనంతరం చిన్నశేష వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం మీద స్వామివారు వరుసగా భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి చంద్రప్రభ వాహన సేవతో ఈ మహోత్సవం ఘనంగా ముగుస్తుంది. ఒక్కరోజులోనే స్వామివారి ఏడు వాహన సేవలను దర్శించుకునే అరుదైన అవకాశం లభించడంతో దేశవ్యాప్తంగా లక్షలాది భక్తులు తిరుమలకు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దర్శన క్యూలైన్లను సక్రమంగా నిర్వహించడం, తాగునీటి సరఫరా, అన్నప్రసాదాల పంపిణీ, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రథసప్తమి వేడుకలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

## సెన్సెక్స్, నిఫ్టీ పతనం

**ప్రతికూల ప్రపంచ సంకేతాలతో నష్టాలు**

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. ప్రతికూల ప్రపంచ సంకేతాలు, కొన్ని దిగ్గజ కంపెనీల షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి సూచీలను కిందకు లాగాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎసచవతీతీచ సెన్సెక్స్ 324.17 పాయింట్లు నష్టపోయి 83,246.18 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎనచవతీతీచసచవతీతీచ నిఫ్టీ 108.85 పాయింట్లు కోల్పోయి 25,585.5 వద్ద ముగిసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి ప్రధాన కంపెనీల త్రైమాసిక ఫలితాల అనంతరం ఈ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడం మార్కెట్ పతనానికి ప్రధాన కారణంగా నిలిచింది. రంగాల వారీగా చూస్తే రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్, మీడియా షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. నిఫ్టీ రియల్టీ ఇండెక్స్ దాదాపు 2 శాతం క్షీణించగా, ఆయిల్ అండ్ గ్యాస్, మీడియా సూచీలు 1.5 శాతం పైగా నష్టపోయాయి. అయితే, ఎఫ్ఎంసీజీ, ఆటో షేర్లలో కొంత కొనుగోళ్ల మద్దతు కనిపించింది. బలహీనంగా ఉంది. గ్రీన్‌ల్యాండ్‌ను కొనుగోలు చేసే ప్రతిపాదనను కొన్ని యూరప్ దేశాలు వ్యతిరేకించడంతో, వాటిపై పన్నులు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఈ పరిణామం ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితిని పెంచి, ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. "నిఫ్టీకి తక్షణ మద్దతు 25,494 వద్ద, ఆ తర్వాత 25,400-25,350 జోన్‌లో బలమైన మద్దతు ఉంది" అని మార్కెట్ నిపుణులు విశ్లేషించారు. మిశ్రమ కార్పొరేట్ ఫలితాలు, ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో మార్కెట్లు కొంతకాలం కన్సాలిడేషన్ జోన్‌లోనే కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బ్రాడర్ మార్కెట్‌లోనూ అమ్మకాలు కొనసాగాయి. మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.37 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.99 శాతం మేర నష్టపోయాయి.

## వైసీపీ అధికారంలోకి రాగానే లోకేశ్ అరెస్ట్

**ఎన్టీఆర్‌పై చంద్రబాబుకు గౌరవం లేదు: లక్ష్మీపార్వతి**

విజయవాడ, జనవరి 19 (ఈవార్తలు): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ నేత లక్ష్మీపార్వతి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మోసాలు, వెన్నుపోటు రాజకీయాలు చంద్రబాబుకు కొత్తకాదని, ఇవన్నీ ఆయనకు అలవాటేనని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ పేరుతో రాజకీయాలు చేయడం తప్ప, నిజంగా ఆయనపై ప్రేమ, గౌరవం చంద్రబాబుకు లేవని ఆరోపించారు. ఎన్టీఆర్ భారీ విగ్రహం ఏర్పాటు చేస్తామని ఇస్తున్న హామీలు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకేనని లక్ష్మీపార్వతి అన్నారు. ఇతర రాష్ట్రాల నాయకులు తమ రాష్ట్రానికి చెందిన మహానీయులకు భారతరత్న ఇప్పించేందుకు కేంద్రంపై పోరాటం చేస్తుంటే... ఎన్టీఆర్ లాంటి మహానాయకుడి విషయంలో చంద్రబాబు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. నిజంగా ఎన్టీఆర్‌పై గౌరవం ఉంటే, కేంద్రంపై ఒత్తిడి చేసి భారతరత్న ఇప్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో హత్యలు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని, దీనికి కూటమి ప్రభుత్వమే కారణమని అన్నారు. మంత్రి నారా లోకేశ్ పై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, వైసీపీ అధికారంలోకి రాగానే ఆయనపై ఎంక్వైరీ కమిషన్ వేసి అరెస్టు చేస్తామని హెచ్చరించారు. లోకేశ్ ను జైల్లో పెడతామని అన్నారు. కూటమి ప్రభుత్వ అరాచకాలపై ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాస్తానని చెప్పారు. దుర్మార్గులకు అండగా నిలవడం అన్యాయమని, ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని లక్ష్మీపార్వతి పేర్కొన్నారు.





# చరిత్ర గుర్తుపెట్టుకొనేలా మేడారం

## రూ.101 కోట్లతో జాతరకు కొత్త రూపు.. పైలాన్ ఆవిష్కరణలో సీఎం రేవంత్

ములుగు, జనవరి 19 (ఈవార్తలు): మేడారం మహా జాతర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా గద్దెను ఆధునికీకరించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. తాను ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో ఇంత గొప్ప కార్యక్రమంలో పాల్గొనే అవకాశం దక్కిందన్నారు. మేడారం మహా జాతరకు సంబంధించి రూ.101 కోట్లతో ఆధునికీకరించిన పలు అభివృద్ధి పనుల పైలాన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. వీటిలో గద్దెల ఆధునికీకరణతోపాటు ప్రాకారం, ఫ్లోరింగ్, అంతర్గత డ్రైనేజీ, క్రౌడ్ లైటింగ్, వాచ్ టవర్, తొమ్మిది స్వాగత ద్వారాలు, హరిత హోటల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు సీసీ రోడ్డు, గద్దెల నుంచి జంపన్నవాగు వెళ్లే రహదారి విస్తరణ, రోడ్డు నిర్మాణం, కూడళ్ల అభివృద్ధి పనులు ఉన్నాయి. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెల వద్ద ప్రత్యేకంగా పూజలు నిర్వహించి, వన దేవతలకు మొక్కులు చెల్లించారు. సీఎం రేవంత్ రెడ్డి తన సతీమణి గీతారెడ్డి, కుమార్తె నైమిషా రెడ్డి, అల్లుడు శరత్, మనవడు రేయాన్ష్‌తో కలిసి పాల్గొనగా.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివచవతీతీచసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, వివేక్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు సీఎం వెంట ఉన్నారు. ఈ



సందర్భంగా పూజారులు, అతిథులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. "భవిష్యత్తు తరాలకు మేడారం చరిత్ర, ఆదివాసీల ఆచారాలు తెలిసేలా అద్భుతంగా ఆధునికీకరించడం జరిగింది. ఇందులో భాగస్వాములైన మంత్రులు, అధికారులు, పూజారులందరికీ అభినందనలు"అని వ్యాఖ్యానించారు. అటు.. సమ్మక్క, సారలమ్మలకు సీఎం.. బంగారం(బెల్లం)తో తులాభారం వేశారు. మనవడు రేయాన్ష్‌తో కలిసి తులాభారం వేయగా 68 కిలోలు తూగారు. దానికి తగ్గట్టుగా బంగారాన్ని తల్లులకు సమర్పించారు. అనంతరం వన దేవతలకు సీఎం కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్, కుటుంబ సభ్యులు, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లకు చీర, సారెతోపాటు వనదేవతల ప్రసాదాలను పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, పూజారులు కాక సారయ్య, సిద్దబోయిన అరుణ్, భోజారావు, కొక్కెర రమేశ్, రఘుపతిరావు, సిద్దబోయిన స్వామి బహూకరించి, ఘనంగా సన్మానించారు. సీఎం రేవంత్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఉదయం 6.25 గంటలకు మేడారం గద్దెల వద్దకు చేరుకున్నారు. తులాభారం, వన దేవతలకు మొక్కులు చెల్లించిన తర్వాత కొద్దిసేపు పూజారులు, మంత్రులతో గద్దెల ప్రాంగణంలో మాట్లాడారు. అనంతరం రూ.101 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ప్రారంభించారు.




## గణేష్‌కు మిస్టర్ టీన్ ఆఫ్ సౌత్ ఇండియా ఫస్ట్ రన్నరప్ అవార్డు

హైదరాబాద్, జనవరి 19 (ఈవార్తలు): అరోరా యూనివర్సిటీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న 19 ఏళ్ల ఈషాన్ గణేష్ యెల్దే ప్రతిష్టాత్మకమైన 'మిస్టర్ టీన్ ఆఫ్ సౌత్ ఇండియా - ఫస్ట్ రన్నరప్' అవార్డును గెలుచుకున్నాడు. ప్రముఖ ఫ్యాషన్ లుక్స్ పేజెంట్ కౌశల్ మందా మార్గదర్శకత్వంలో నిర్వహించిన 'ది లుక్స్ పేజెంట్'లో పాల్గొని తన వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం ప్రదర్శనతో న్యాయనిర్ణేతలను, ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. ఈషాన్ గణేష్ సాధించిన ఈ అద్భుత విజయం యువతకు స్ఫూర్తిగా నిలుస్తోందని పలువురు ప్రశంసించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈషాన్ గణేష్ కు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు, బంధువులతో పాటు తెలంగాణ బజరంగ్ సేన అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు, బజరంగ్ సేన మహిళా అధ్యక్షురాలు వాణి, కృష్ణవేణి, బజరంగ్ సేన రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ప్రభు బిరదార్, బాలాజీ, నరేష్, విజయ్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

## నిమ్స్‌లో స్టెమ్ సెల్స్ ల్యాబ్

**ప్రారంభించిన మంత్రి రాజనర్సింహా**



పంజాగుట్ట/హైదరాబాద్, జనవరి 19 (ఈవార్తలు): పేదకు అత్యాధునిక వైద్యాన్ని అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఈ లక్ష్యంలో భాగంగానే నిమ్స్‌లో స్టెమ్ సెల్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ల్యాబ్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన స్టెమ్ సెల్ ల్యాబ్‌ను మంత్రి దామోదర సోమవారం ప్రారంభించారు. విత్తనం నుంచి మహా వృక్షం తయారు అయినట్టే.. స్టెమ్ సెల్స్ నుంచి కొత్త కణాలను, అవయవాలను తయారు చేయవచ్చని పేర్కొన్నారు. మన శరీరంలో ఏదైనా భాగం దెబ్బతిన్నప్పుడు లేదా జబ్బు చేసినప్పుడు, ఆ భాగాన్ని రిపేర్ చేసే అద్భుతమైన శక్తి ఈ కణాలకు ఉంటుందని మంత్రి రాజనర్సింహ వెల్లడించారు. మందులతో నయం కాని మొండి వ్యాధులను కూడా నయం చేయగలిగే శక్తి వీటికి ఉంటుందన్నారు. ముఖ్యంగా క్యాన్సర్, రక్త సంబంధిత వ్యాధులు, తలసేమియా వంటి జబ్బులతో బాధపడేవారికి ఈ చికిత్స సంజీవని లాంటిదని మంత్రి అన్నారు. ఆయా వ్యాధుల వల్ల శరీరంలో దెబ్బతిన్న కణజాలాన్ని మళ్లీ కొత్తగా సృష్టించేందుకు ఈ చికిత్స ఉపయోగపడుతుందని వివరించారు. ప్రస్తుతం స్టెమ్ సెల్ చికిత్స కొన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లోనే అందుబాటులో ఉందని, అది కూడా రూ. లక్షల ఖర్చుతో కూడుకొని ఉంటుందని తెలిపారు. సామాన్య ప్రజలకు కూడా అత్యాధునిక వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో నిమ్స్‌లో స్టెమ్ సెల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ల్యాబ్‌లో ప్రధానంగా స్టెమ్ సెల్స్‌పై లోతైన పరిశోధనలు జరుగుతాయన్నారు. ప్రభుత్వం తరఫున ఎలాంటి సహకారమైనా అందిస్తామని తెలిపారు. తులసి థెరప్యూటిక్స్, నిమ్స్ డాక్టర్లు పరిశోధనలు చేస్తారని మంత్రి వివరించారు. ఈ పరిశోధనల ఫలితంగా, భవిష్యత్తులో నిమ్స్‌లోనే పేద రోగులకు అతి తక్కువ ఖర్చుతో స్టెమ్ సెల్ థెరపీ అందించగలుగుతామన్నారు.

# యూఏఈ అధ్యక్షుడికి మోదీ ఘనస్వాగతం

## నా సోదరుడు అంటూ సోషల్ మీడియాలో పోస్ట్



న్యూఢిల్లీ: భారత పర్యటనకు వచ్చిన యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఘన స్వాగతం పలికారు. ప్రొటోకాల్‌ను పక్కనపెట్టి, ఢిల్లీ విమానాశ్రయానికి స్వయంగా వెళ్లి ఆయనను ఆత్మీయంగా ఆహ్వానించారు. అనంతరం ఇద్దరు నేతలు ఒకే కారులో ప్రయాణించడం వారి మధ్య ఉన్న బలమైన స్నేహబంధానికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా లోక్ కల్యాణ్ మార్గ్‌లోని తన నివాసంలో యూఏఈ అధ్యక్షుడికి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రధాని మోదీ భారతీయ సంస్కృతి, నైపుణ్యానికి ప్రతీకగా నిలిచే ప్రత్యేక కానుకలను అందజేశారు. గుజరాతీ కుటుంబాల్లో తరతరాలుగా బంధాలకు కేంద్రంగా ఉండే, చేతితో చెక్కిన అందమైన చెక్క ఉయ్యాల (ఝూలా)ను బహుకరించారు. యూఏఈ 2026ను 'కుటుంబ సంవత్సరం'గా ప్రకటించిన నేపథ్యంలో ఈ కానుకకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. దీంతో పాటు, కశ్మీర్‌కు చెందిన సుప్రసిద్ధ పష్మీనా శాలువాను తెలంగాణలో తయారైన వెండి పెట్టెలో పెట్టి అందజేశారు. "నా సోదరుడు, యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌కు స్వాగతం పలికేందుకు విమానాశ్రయానికి వెళ్లాను. బలమైన భారత్-యూఏఈ స్నేహానికి ఆయన ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఈ పర్యటన తెలియజేస్తోంది" అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. యూఏఈ అధ్యక్షుడి తల్లి షేఖా ఫాతిమాకు కూడా పష్మీనా శాలువాతో పాటు, వెండి పెట్టెలో కశ్మీరీ కుంకుమపువ్వును బహూకరించారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన రంగాల్లో బలమైన సంబంధాలు ఉన్నాయి. ఈ పర్యటన ద్వారా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంతో పాటు, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చించనున్నారు. గత దశాబ్ద కాలంలో యూఏఈ అధ్యక్షుడు భారత్‌లో పర్యటించడం ఇది ఐదోసారి కావడం గమనార్హం.










## ఉగ్రవాదానికి ఆజ్యం పోయవద్దు

### పోలండ్ ఉపప్రధానికి జైశంకర్ చురక

న్యూఢిల్లీ: భారత్‌తో స్నేహ సంబంధాలు కోరుకునే దేశాలు ఉగ్రవాదంపై మెతక వైఖరిని విడనాడాలని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. పోలండ్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి రాడోస్లావ్ సికోర్స్కీతో జరిగిన సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. గత ఏడాది పాకిస్థాన్ పర్యటన సందర్భంగా రాడోస్లావ్ జమ్ము కశ్మీర్‌పై స్పందిస్తూ, కశ్మీర్ సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని పాక్ నేతలతో కలిసి ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఈ నేపథ్యంలో జైశంకర్ స్పందిస్తూ, ఉగ్రవాదాన్ని భారత్ ఎప్పటికీ వ్యతిరేకిస్తూనే ఉంటుందని, కాబట్టి తమ దేశంతో స్నేహం కోరుకునే వారు ఉగ్రవాదంపై మెతక వైఖరిని ప్రదర్శించవద్దని కోరారు. ఉగ్రవాదులు ఎప్పటికైనా ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. సరిహద్దు ఉగ్రవాదం వల్ల భారత్ ఎదుర్కొంటున్న సమస్యల గురించి రాడోస్లావ్‌కు తెలుసని అన్నారు. సరిహద్దు ఉగ్రవాదానికి ఎవరూ ఆజ్యం పోయకూడదని జైశంకర్ హితవు పలికారు. ప్రపంచం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న సమయంలో ప్రత్యేకంగా భారత్‌ను లక్ష్యంగా చేసుకోవడం అన్యాయమని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్-పోలండ్ మధ్య సంబంధాలు స్థిరంగా కొనసాగుతున్నాయని, వాటిని కాపాడుకోవడానికి నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

# మహిళతో కర్ణాటక డీజీపీ రాసలీలలు

### ఆఫీసులోనే మహిళతో అసభ్య ప్రవర్తన.. ఘటనపై నివేదిక ఇవ్వాలని ఆదేశించిన సిద్దరామయ్య









బెంగళూరు: కర్ణాటకలో డీజీపీ స్థాయి అధికారి కె.రామచంద్రరావు తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. ఓ మహిళతో రాసలీలల వీడియోలు పెను దుమారం రేపుతున్నాయి. తన కార్యాలయంలోనే ఓ మహిళతో అభ్యంతరకర రీతిలో ప్రవర్తించినట్లు ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే, ఈ ఆరోపణలను రామచంద్రరావు ఖండించారు. అవన్నీ మార్ఫింగ్ చేసిన వీడియోలని స్పష్టం చేశారు. గతంలో గోల్డ్ స్మగ్లింగ్ కేసులోనూ రామచంద్రరావుపై ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో అరెస్టయిన నటి రన్యా రావుకు ఈయన సవతి తండ్రి. ఈ కేసు నేపథ్యంలో 2025 మార్చిలో ప్రభుత్వం ఆయన్ను నిర్బంధ సెలవుపై పంపించి, ఇటీవలే తిరిగి విధుల్లోకి తీసుకుంది. ప్రస్తుతం ఆయన సివిల్ రైట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ డీజీపీగా పనిచేస్తున్నారు. కాగా, ఈ వీడియోల వ్యవహారంపై న్యాయవాదిని సంప్రదించి తదుపరి చర్యలు తీసుకుంటానని రామచంద్రరావు మీడియాకు తెలిపారు. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ వీడియోల్లో డీసీఆరచవతీతీచ డీజీపీ రామచంద్రరావు యూనిఫాంలో ఉండగానే తన అధికారిక ఛాంబర్‌లో ఓ మహిళతో సన్నిహితంగా, అశ్లీల ప్రవర్తనతో కూడిన దృశ్యాలు ఉన్నాయి. ఒక క్లిప్‌లో ఆయన మహిళను ముద్దుపెట్టుకుంటుండగా, మరో వీడియోలో సూట్‌లో ఉండగా భారత జాతీయ పతాకం, పోలీసు శాఖ చిహ్నం ముందు ఇలాంటి ప్రవర్తనే కనబరిచారు. ఈ వీడియోల్లో మహిళ ముఖాన్ని బ్లర్ చేసి, నేపథ్య సంగీతం జోడించి సర్క్యులేట్ చేశారు. ఈ వివాదంపై వివరణ ఇచ్చేందుకు రామచంద్రరావు సోమవారం హోంమంత్రి జి. పరమేశ్వర కార్యాలయానికి వెళ్లారు. అయితే, ఆయనతో భేటీకి మంత్రి నిరాకరించినట్లు సమాచారం. ఈ పరిణామంపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని, ఘటనపై పూర్తి నివేదిక సమర్పించాలని హోం శాఖను ఆదేశించారని తెలిసింది. ఈ వీడియోలను ఏడాది క్రితమే చిత్రీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, వీటిని ఇప్పుడు ఎందుకు విడుదల చేశారనే దానిపై స్పష్టత లేదు. ఈ ఘటనపై మాజీ హోంమంత్రి ఆరగ జ్ఞానేంద్ర స్పందిస్తూ.. సీనియర్ అధికారి ఈ స్థాయికి దిగజారడం సిగ్గుచేటని, ఆయన పోలీసు శాఖను అవమానించారని, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఆరు గంటల పాటు విజయ్‌పై విచారణ

### కరూర్‌పై పలు కీలక ప్రశ్నలు సంధించిన అధికారులు



న్యూఢిల్లీ: తమిళనాడు వెట్రి కళగం (టీవీకే) అధినేత, ప్రముఖ నటుడు విజయ్‌ను కరూర్ తొక్కిసలాట కేసులో సీబీఐ రెండోసారి విచారించింది. సోమవారం ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయంలో ఈ విచారణ దాదాపు ఐదున్నర గంటల పాటు సాగింది. ఈ కేసు దర్యాప్తులో ఇది కీలక దశగా భావిస్తున్నారు. గతేడాది సెప్టెంబర్ 27న కరూర్‌లో విజయ్ నిర్వహించిన రాజకీయ ర్యాలీలో భారీగా జనం తరలిరావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘోర దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవడంతో, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులో సంబంధం ఉన్న వారిని ఢిల్లీకి పిలిపించి సీబీఐ అధికారులు విచారిస్తున్నారు. జనవరి 12న మొదటిసారి విజయ్‌ను ఆరు గంటల పాటు ప్రశ్నించారు. విచారణ సందర్భంగా, "ర్యాలీలో ట్రాఫిక్ రద్దీని గమనించారా జనాన్ని నియంత్రించడంలో ఏడు గంటల ఆలస్యం ఎందుకు జరిగింది రద్దీ ఉన్నప్పటికీ కాన్వాయ్‌ను ఎందుకు ముందుకు పోనిచ్చారు" వంటి పలు కీలక ప్రశ్నలను అధికారులు విజయ్ ముందు ఉంచినట్లు సమాచారం. కొన్ని ప్రశ్నలకు ఆయన సమాధానమివ్వగా, మరికొన్నింటికి పత్రాలు చూసి చెబుతానని, సమయం కావాలని కోరినట్లు తెలిసింది. విచారణ ముగిశాక, విజయ్‌కు మళ్లీ ఎలాంటి సమన్లు జారీ చేయలేదని టీవీకే పార్టీ అడ్మినిస్ట్రేటర్ నిర్మల్ కుమార్ స్పష్టం చేశారు. విజయ్‌ను అరెస్టు చేస్తారంటూ సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని, దర్యాప్తునకు తాము పూర్తిగా సహకరిస్తామని ఆయన తెలిపారు. కాగా, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, ఫిబ్రవరి రెండో వారంలోగా ఈ కేసు చార్జిషీట్‌ను సుప్రీంకోర్టులో దాఖలు చేయడానికి సీబీఐ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

## హిందువులపై దాడులు మతపరమైనవి కావు

### నేరపూరిత స్వభావం కలిగినవారు చేసినవేనన్న బంగ్లాదేశ్

### 645 ఘఘటనల్లో 71 మతపరమైనవని వెల్లడి

### 50 ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు వెల్లడి

ఢాకా: తమ దేశంలో హిందువులు, ఇతర మైనారిటీలపై జరుగుతున్న దాడులపై బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం స్పందించింది. తమ దేశంలో మైనారిటీలకు సంబంధించిన ఘటనల్లో చాలా వరకు నేరపూరిత స్వభావం కలిగిన వ్యక్తులు చేసినవేనని, వాటిలో మతపరమైన ఉద్దేశాలు లేవని తెలిపింది. మైనారిటీలకు సంబంధించి గత ఏడాది 645 ఘటనలు చోటు చేసుకున్నాయని పేర్కొంది. ఈ మేరకు ఆ దేశ తాత్కాలిక ప్రధాని మహమ్మద్ యూనస్ కార్యాలయం వివరాలు వెల్లడించింది. వాటిలో 71 ఘటనల్లో మతపరమైన కోణాలు ఉన్నట్లు పేర్కొంది. ఆలయాలపై దాడులకు సంబంధించి 38 ఘటనలు నమోదైనట్లు తెలిపింది. ఆ 71 ఘటనలకు సంబంధించి 50 అంశాల్లో పోలీసులు కేసు నమోదు చేసినట్లు వెల్లడించింది. మిగిలిన 21 ఘటనలపై తగిన చర్యలు తీసుకున్నామని పేర్కొంది. నేరం ఏదైనా తీవ్రంగానే పరిగణిస్తున్నామని బంగ్లాదేశ్ స్పష్టం చేసింది. మరోవైపు, ఈ ప్రకటనను బంగ్లాదేశ్ హిందూ, బుద్ధిస్ట్, క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్ తీవ్రంగా ఖండించింది. ఇలాంటి ప్రకటనలు నేరస్థులను ప్రోత్సహించి, వారికి శిక్షపడదనే భావనను కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. గత మూడు వారాల వ్యవధిలోనే 10 మందికి పైగా హిందువులు బంగ్లాదేశ్‌లో హత్యకు గురయ్యారు. దీంతో అక్కడి హిందువులు, ఇతర మైనారిటీల భద్రతపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ దాడులపై చర్యలు తీసుకోవాలని బంగ్లాదేశ్‌పై ఒత్తిడి తెచ్చిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది.

## బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఎన్నిక



న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రేపు ఉదయం 11 గంటలకు ఆయన పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నితిన్ నబీన్ ప్రస్తుతం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఈ ఎన్నిక జరిగింది. నితిన్ నబీన్ (46) బీహార్ రాష్ట్రానికి చెందినవారు. ఆయనను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గత ఏడాది డిసెంబర్‌లో బీజేపీ ప్రకటించింది. ఆయనను పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు అప్పుడే వార్తలు వెలువడ్డాయి. నబీన్‌కు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపూర్ నుంచి నబిన్ నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

## డ్రైవర్‌కు రూ.10 కోట్ల లాటరీ

చండీగఢ్: హర్యానా రాష్ట్రం, సిర్సా జిల్లాలోని ముహమ్మద్‌పురియా గ్రామంలో ఒక డ్రైవర్ పది కోట్ల రూపాయల భారీ లాటరీని గెలుచుకున్నాడు. 35 సంవత్సరాల పృథ్వీ సింగ్ డ్రైవర్‌గా పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు, తండ్రి, సోదరుడు ఉన్నారు. భార్య స్థానిక పాఠశాలలో ప్యూన్‌గా పనిచేస్తోంది. పృథ్వీ సింగ్ తండ్రి కూడా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పృథ్వీ సింగ్ రూ.500 వెచ్చించి పంజాబ్ లోహ్రి మకర సంక్రాంతి 2026 లాటరీ టిక్కెట్‌ను కొనుగోలు చేశాడు. ఈ లాటరీలో అతడికి మొదటి బహుమతిగా రూ.10 కోట్లు లభించాయి. తాను లాటరీ టిక్కెట్ కొనుగోలు చేయడం ఇది మూడవసారి అని పృథ్వీ సింగ్ తెలిపాడు. ఈసారి తనకు అదృష్టం కలిసి వచ్చిందని సంతోషం వ్యక్తం చేశాడు. ఇంతకుముందు రెండుసార్లు కొనుగోలు చేసినప్పటికీ, తనకు ఈసారి లాటరీ తగులుతుందని ఎప్పుడూ అనుకోలేదని అన్నాడు. లాటరీ ద్వారా వచ్చిన నగదును పిల్లల భవిష్యత్తు కోసం ఉపయోగిస్తానని పృథ్వీ సింగ్ వెల్లడించారు. లాటరీ ద్వారా వచ్చిన డబ్బుతో ఒక లగ్జరీ కారు కొనివ్వమని తన తండ్రిని అడుగుతానని పృథ్వీ సింగ్ ఆరేళ్ల కుమారుడు దక్ష్ చెప్పారు.




## జెన్ జీ కోసం రియల్ మీ కొత్త ఫోన్

### భారత విద్యార్థి డిజైన్.. ట్రాన్స్‌వ్యూ టెక్నాలజీ

న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ రియల్‌మీ తన కొత్త స్మార్ట్‌ఫోన్ 'రియల్‌మీ పీ4 పవర్'ను మార్కెట్లోకి తీసుకురాబోతోంది. ఈసారి కేవలం ఫీచర్లపైనే కాకుండా, డిజైన్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ముఖ్యంగా నేటి యువతరం ఆలోచనలకు అద్దం పట్టేలా 'ఫర్ జెన్ జెడ్, బై జెన్ జెడ్' అనే ఫిలాసఫీతో ఈ ఫోన్‌ను రూపొందించింది. ఈ క్రమంలో ప్రముఖ డిజైన్ సంస్థ పెరల్ అకాడమీ విద్యార్థులను భాగస్వాములను చేయడం విశేషం. ఈ ఫోన్ 'ట్రాన్స్‌వ్యూ డిజైన్' అనే సరికొత్త కాన్సెప్ట్‌తో వస్తోంది. ఫోన్ లోపలి సాంకేతిక భాగాలను దాచిపెట్టకుండా, వాటి స్ఫూర్తితోనే డిజైన్‌ను తీర్చిదిద్దారు. ఫోన్ పైభాగంలో సర్క్యూట్ ప్యాటర్న్‌లు, స్క్రూలతో కూడిన క్రిస్టల్ ప్యానెల్ ఉండగా, కింది భాగంలో మ్యాట్ ఫినిషింగ్‌తో సౌకర్యవంతమైన గ్రిప్‌ను అందిస్తూ, స్టైల్‌ను ప్రతిబింబిస్తుంది. ఈ విధంగా టెక్నాలజీ, సౌకర్యం రెండింటినీ సమపాళ్లలో మేళవించారు. ఈ డిజైన్ రూపకల్పనలో రియల్‌మీ మరో అడుగు ముందుకేసి, పెరల్ అకాడమీ విద్యార్థులతో కలిసి పనిచేసింది. వర్క్‌షాప్‌లు నిర్వహించి, వారి ఆలోచనలు, స్కెచ్‌లను స్వీకరించింది. వారిలో సంకల్ప్ పాంచాల్ అనే విద్యార్థి అందించిన డిజైన్ కాన్సెప్ట్‌ను తుది ఉత్పత్తిలో భాగం చేసింది. ఒక మాస్ మార్కెట్ స్మార్ట్‌ఫోన్ డిజైన్‌లో విద్యార్థుల ఆలోచనలకు నేరుగా చోటు కల్పించడం ఇదే తొలిసారి. ప్రస్తుత జెన్ జెడ్ యువతకు స్మార్ట్‌ఫోన్ కేవలం ఒక పరికరం కాదు, వారి వ్యక్తిత్వానికి, సృజనాత్మకతకు నిదర్శనం. వారు పనితీరుతో పాటు స్టైల్, డిజైన్‌కు కూడా అంతే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ మార్పును గమనించిన రియల్‌మీ, తన పీ సిరీస్‌ను భారతీయ యువత అభిరుచులకు అనుగుణంగా మారుస్తూ వస్తోంది. ఈ కొత్త ఆవిష్కరణ ద్వారా, రియల్‌మీ యువతను కేవలం వినియోగదారులుగా కాకుండా, తమ ఉత్పత్తుల రూపకల్పనలో భాగస్వాములుగా చూస్తోందని స్పష్టం చేసింది.







## వయ్యారి చిత్రం




దర్శ గుప్తా

## ఆంధ్రా టు తెలంగాణ..
# మెప్పించలే!




నవీన్ పొలిశెట్టి లీడ్ రోల్ లో అతని డైలాగ్స్, స్క్రీన్ ప్లే లోనే వచ్చిన సినిమా అనగనగా ఒక రాజు. సంక్రాంతి సినిమాల పండగలో తను కూడా జాయిన్ అయ్యి ప్రేక్షకులకు ఒక మంచి ఆహ్లాదకరమైన ఎంటర్టైనింగ్ సినిమా ఇచ్చాడు నవీన్ పొలిశెట్టి. పేరుకి మారి అని డైరెక్టర్ ని పెట్టినా సరే ఈ సినిమా విషయంలో అన్నీ తానై నడిపించాడు నవీన్ పొలిశెట్టి. అందుకే ఈ సినిమా సక్సెస్ విషయంలో ఎక్కువ క్రెడిట్ ఆయనకే దక్కుతుంది. అయితే సితార ఎంటర్టైన్ మెంట్స్, ఫార్చున్ ఫోర్ సినిమాస్ కలిసి నిర్మించిన అనగనగా ఒక రాజు సినిమాలో నవీన్ పొలిశెట్టి సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటించింది. మిక్కీ జె మేయర్ మ్యూజిక్ అందించిన ఈ సినిమాలో భీమవరం బాల్మా సాంగ్ రిలీజ్ ముందే బాగా ఎక్కేసింది. రాజు గారి పెళ్లిరో సాంగ్ కూడా ప్రేక్షకులను అలరించింది. ఐతే సితార బ్యానర్ లో స్పెషల్ ఐటెం సాంగ్స్ కి మంచి క్రేజ్ ఉంటుంది. మాస్ ఆడియన్స్ ని మెప్పించేలా ఈ సాంగ్స్ ఉంటాయి. గుంటూరు కారం లో కుర్చీ మడతపెట్టి సాంగ్ రాగా.. సితార నుంచి వచ్చిన మ్యాడ్, మ్యాడ్ 2 లో కూడా స్పెషల్ సాంగ్స్ ఆకట్టుకున్నాయి. కానీ సంక్రాంతికి వచ్చిన అనగనగా ఒక రాజు సినిమాలో ఆంధ్రా టు తెలంగాణ సాంగ్ మాత్రం ఇంప్రెస్ చేయలేకపోయింది. అనగనగా ఒక రాజు సినిమా ప్రేక్షకులను సూపర్ ఎంటర్టైన్ చేసినా ఈ సాంగ్ విషయంలో మాత్రం కాస్త నిరుత్సాహ పరిచింది. సినిమాలోనే కాదు ఈ సాంగ్ యూట్యూబ్ లో కూడా ఆడియన్స్ పెద్దగా పట్టించుకోలేదు. మిక్కీ జే మేయర్ మ్యూజిక్ అందించిన ఆంధ్రా టు తెలంగాణ సాంగ్ ని శాన్వీ మేఘన గ్లామర్ షోతో అలరించే ప్రయత్నం చేసింది. ఐతే మామూలుగా అయితే స్పెషల్ ఐటెం సాంగ్స్ ఏవైనా మాస్ ఆడియన్స్ కి వెంటనే ఎక్కేస్తాయి. ఆ వైబ్ తోనే ఎక్కడ విన్నా ఆ సాంగ్ వినిపిస్తుంది. కానీ అనగనగా ఒక రాజు సినిమాలో ఈ సాంగ్ మాత్రం అంత ఇంపాక్ట్ చూపించలేదు. సినిమా విషయంలో సాటిస్ఫై అయిన ఆడియన్స్ ఐటెం సాంగ్ ని మాత్రం ఎంజాయ్ చేయలేకపోయారు. ఇక సంక్రాంతి రేసులో వచ్చిన ఐదు సినిమాల్లో నవీన్ పొలిశెట్టి తన సత్తా చాటాడు. ఏదైతే ఆడియన్స్ తన మీద పెట్టుకున్న ఎక్స్ పెక్టేషన్స్ ని రీచ్ అయ్యే అవుట్ తో వచ్చి సక్సెస్ అందుకున్నాడు. ఈ సంక్రాంతికి వచ్చిన సినిమాల్లో అన్నీ కూడా ప్రేక్షకులను ఎంటర్టైన్ చేయాలనే కాన్సెప్ట్ తోనే వచ్చాయి. అందుకే సినిమాలు కూడా మాక్సిమం మెప్పించాయి.

# కాబిల్ 2 సీక్వెల్ వస్తోంది.. కానీ!

హృతిక్ రోషన్-యామీ గౌతమ్ జంటగా సంజయ్ గుప్తా తెరకెక్కించిన కాబిల్ అప్పట్లో ఓ క్లాసిక్ హిట్ గా నిలిచింది. దృష్టి లోపమున్న ఇద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారడం, ధాంపత్య జీవితంలోకి అడుగు పెట్టడాన్ని ఎంతో అందంగా, హృద్యంగా మలిచారు సంజయ్. 2017 లో రిలీజ్ అయిన రొమాంటిక్ థ్రిల్లర్ ఓ క్లాసిక్ చిత్రంగా అలరిస్తుంది. సన్నివేశాల్లో ఎలాంటి అసభ్యత లేకుండా క్లీన్ అండ్ గ్రీన్ ఎంటర్ టైనర్ గా విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అంధుడి పాత్రలో హృతిక్ ,యామీ గౌతమ్ కట్టి పడేసారు. ఇద్దరు రియలిస్టిక్ పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకుంటారు. ఈ సినిమాకు సీక్వెల్ కూడా ఉంటే బాగుంటుందనే అప్పట్లోనే అభిమానులు అభిప్రిఆయపడ్డారు. సీక్వెల్ చేయాలని సంజయ్ గుప్తాను అడిగారు. కానీ అప్పుడాయన ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. తాజాగా ఎనిమిదేళ్లకు




కాబిల్ కు సీక్వెల్ గా కాబిల్ 2ని ప్రకటించి సర్ ప్రైజ్ చేసారు. సోషల్ మీడియా వేదికగా ఓ అభిమాని అడగగా దర్శకుడు ఈ విషయాన్ని రివీల్ చేసారు. సీక్వెల్ సిద్ధంగా ఉంది. ఇప్పుడు రాబోయే చిత్రం మునుపటి కంటే మరింత వైవిధ్యంగా ఉంటుందన్నారు. దీంతో కాబిల్ 2పై అంచనాలు ఆకాశన్నంటుతున్నాయి. అయితే ఇందులో హీరో, హీరోయిన్లగా హృతిక్, యామీ గౌతమ్ లనే రిపీట్ చేస్తారా కొత్త వారితో ముందుకెళ్తరా అన్నది మాత్రం సస్పెన్స్ గా మారింది. దర్శకుడు సీక్వెల్ ప్రకటించారు గానీ అందులో నటీనటులు ఎవరు అన్నది వెల్లడించలేదు. సాధారణంగా బాలీవుడ్ లో సీక్వెల్స్ అంటే అందులో హీరో, హీరోయిన్లు మారిపోతారు. కొత్త నటీనటులతో దర్శకులు ముందుకెళ్తారు. కాబిల్ సినిమా చేసే సమయానికి హృతిక్ మొదటి భార్యతో కలిసి ఉన్నారు.

## కుక్కలనే ఎందుకు చంపేస్తున్నారు: రేణుదేశాయ్




గత ఏడాది కాలంలో ఎక్కువ మరణాలు వీధి కుక్కల దాడుల్లోనే జరుగుతున్నాయనే వార్త దేశాన్ని అతలాకుతలం చేస్తోంది. ముఖ్యంగా ఎక్కడ చూసినా చిన్న గ్రామం మొదలుకొని పెద్దపెద్ద పట్టణాల్లో కూడా ఈ వీధి కుక్కల దాడులు భారీగా పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలోనే ఈ వీధి కుక్కల బెడదపై ఏకంగా సుప్రీంకోర్టు విచారణ నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రజల భద్రత అలాగే జంతు ప్రేమికుల భావోద్వేగాలను సమతుల్యం చేస్తూ తీర్పులు ఇస్తోంది. అంతేకాదు పాఠశాలలు, ఆసుపత్రులు, క్రీడా ప్రాంగణాలు, బస్ డిపోలు, రైల్వే స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాలు వంటి జనం ఎక్కువగా ఉండే ప్రదేశాల నుండి వీధి కుక్కలను వెంటనే తరలించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అంతేకాదు ఎవరైతే వీధి కుక్కలకు అన్నం పెడుతున్నారో.. ఆ కుక్కలు ఇతరులపై దాడి చేసి చంపేస్తే.. ఆ బాధ్యత అన్నం పెట్టిన వారితో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలదే అంటూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇలా ఒకవైపు ఈ వీధి కుక్కల దాడులపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతుంటే .. మరొకవైపు ఈ వీధి కుక్కలపై దాడులు చేస్తూ వాటిని చంపేయడం జంతు ప్రేమికులకు ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. ఈ నేపథ్యంలోనే వీధి కుక్కలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో జంతు ప్రేమికురాలిగా పేరు సొంతం చేసుకున్న రేణు దేశాయ్ ప్రెస్ మీట్ పెట్టి మరీ ఆవేదన వ్యక్తం చేసింది.

## నయనతార అంటే అంతే మరి!



లేడీ సూపర్ స్టార్ నయనతార సౌత్ లో ఎంత పెద్ద హీరోయిన్ అన్నది చెప్పాల్సిన పనిలేదు. దక్షిణాదిన ట్రెడింగ్లో ఉన్న నెంబర్ వన్ బ్యూటీ. అత్యధిక పారితోషికం తీసుకుంటోన్న హీరోయిన్ కూడా ఆమె. సౌత్ లో అన్ని పరిశ్రమలు ఆమెతో సినిమాలు చేయడానికి ఎంతో ఆసక్తి చూపిస్తాయి. స్టార్ హీరోలు సైతం ఆమె డేట్లు కోసం క్యూలో ఉంటారు అంటే అతి శయోక్తి కాదు. దీనంతంటికీ కారణం నయనతార తనను తాను బిల్డ్ చేసుకోవడమే. నలుగురిలో ఒకరిలా కాకుండా నలుగురికి భిన్నంగా ఉండటమే ఆక్రేజ్కి కారణమైంది. వృత్తి, వ్యక్తగతంగా నయన్ ఎంతో స్పెషల్ గా కనిపిస్తుంది. నటిగా మాత్రం భిన్నమైన స్ట్రాటజీతోనే అడుగులు వేస్తోంది. క్లాస్ మాస్ ఇమేజ్ ని తెలివిగా బ్యాలెన్స్ చేయడం తనకు తెలిసినట్లుగా మరో నటికి తెలియడం లేదనొచ్చు. కోలీవుడ్ స్టార్స్ తో నటిస్తూనే తెలుగులో సీనియర్ హీరోలకు జోడీగా నటిస్తోంది. ఆ తర్వాత తరం హీరోలతో సినిమాలు చేయడం లేదు.



## హ్యాట్రిక్ దిశగా మీనాక్షి

అందాల మీనాక్షి చౌదరి మంచి విజయంతో కొత్త ఏడాదిలోకి గ్రాండ్ గా అడుగు పెట్టింది. సంక్రాంతి కానుకగా రిలీజ్ అయిన అనగనగా ఒక రాజు తో డీసెంట్ హిట్ అందుకుంది. ఇందులో మీనాక్షి పాత్రకు మంచి పేరొచ్చింది. మరి ఈ విజయంతో ఎలాంటి అవకాశాలు అందుకుంటుందో చూడాలి. గత ఏడాది సంక్రాంతికి కూడా అమ్మడు సంక్రాంతికి వస్తున్నాంతో భారీ విజయాన్నే అందుకుంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఏకంగా 300 కోట్ల వసూళ్లనే సాధించింది. కానీ ఆ తర్వాత నటిగా మాత్రం బిజీ కాలేకపోయింది. అక్కడో కారణం ఉంది. హీరోయిన్ పరంగా ఆ సినిమా క్రెడిట్ అంతా ఐశ్వర్యా రాజేష్ కొట్టేసింది.

## మమిత బైజు..
# సినిమాల జోరు!



ప్రేమలు విజయంతో సౌత్ లో ఫేమస్ అయిన బ్యూటీ మమితాబైజు ఒక్క సారిగా తమిళ, తెలుగు సినిమాలో బిజీ అయింది. వరుసగా ఛాన్సు లు అందుకుంటూ క్షణం తీరిక లేకుంగా గడుపుతోంది. జననాయగన్ లో దళపతి విజయ్ కి జోడీగా నటించింది. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతున్న చిత్రమిది. ఈ సినిమా విజయం సాధిస్తే మమిత మమితా బైజు కోలీవుడ్లో మరింత బిజీ అవుతుంది. సూర్య 46వ చిత్రంలోనే ఈ భామే హీరోయిన్. సూర్య హీరోగా వెంకీ అట్లూరి తెరకెక్కిస్తోన్న చిత్రమిది. దీంతో పాటు ఇరాండు వనంలోనూ నటిస్తోంది. మమితా బైజు నటిస్తున్న మరో తెలుగు చిత్రం డియర్ కృష్ణ. ఇది ఒక యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్. ఇందులో అక్షయ్ కృష్ణన్ హీరోగా నటిస్తున్నాడు. ఈ సినిమా ద్వారానే మమిత తెలుగులో లాంచ్ అవుతుంది. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పటికే విడుదలైంది. అలాగే ప్రేమలుకు సీక్వెల్ గా ప్రేమలు 2 కూడా ప్రకటించారు. పాన్ ఇండియాలో భారీ ఎత్తున ఈ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నారు. అయితే ఇదే ప్రేమలు 2 కంటే ముందే అదే జోడీ మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతున్నారు. దర్శకుడు ప్రేమ్ గిరీష్ తో మమితా బైజు మరో సినిమాకు చేయడానికి రెడీ అవుతోంది. ఇందులో సంగీత్ ప్రతాప్ హీరోగా నటిస్తున్నాడు. ప్రేమకథా నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రమిది. ఇందులో హీరోయిన్ గా పలువురు కన్నడ భామల్ని పరిశీలించి చివరిగా మమితనే ఫైనల్ చేసారు. ప్రేమలు సక్సెస్ అనంతరం అదే దర్శకుడితో మమితా బైజు పని చేయడం విశేషం. ఈసినిమా షూటింగ్ ఏప్రిల్ నుంచి ప్రారంభించాలని సన్నాహాలు చేస్తున్నారు.



# లండన్‌కు కోహ్లి

## రెండు నెలలు అక్కడే!

స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ లండన్‌కు వెళ్లిపోయాడు. సోమవారం ఉదయమే ముంబై ఎయిర్‌పోర్ట్‌లో లండన్ ఫ్లైట్ ఎక్కాడు. మరో ఐదు నెలల వరకు టీమిండియాకు వన్డే మ్యాచ్‌లు లేకపోవడంతో విరాట్ కోహ్లీ లండన్‌కు వెళ్లిపోయాడు. విరాట్ కోహ్లీ తన ఫ్యామిలీతో లండన్‌లో కాపురం పెట్టిన సంగతి తెలిసిందే. తన ఇద్దరు పిల్లలు వామిక, అకాయ్‌కు సెలెబ్రిటీ హోదా ఉండకూడదని, మీడియాకు దూరంగా ఉంచాలనే కారణాలతో విరాట్ కోహ్లీ-అనుష్క శర్మ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే అంతర్జాతీయ టీ20లతో పాటు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన కోహ్లీ.. కేవలం వన్డే ఫార్మాట్‌లోనే కొనసాగుతున్నాడు. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. టీమిండియాకు మరో ఐదు నెలల పాటు వన్డే మ్యాచ్‌లు లేవు. ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా జూలై 14న బర్మింగ్ హామ్ వేదికగా భారత్ తొలి వన్డే ఆడనుంది. ప్రస్తుతం టీమిండియా ఫోకస్ అంతా ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న టీ20 ప్రపంచకప్ మీదే ఉంది. అలాగే జనవరి 21 నుంచి న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్ ఆడనుంది. ప్రపంచకప్ ముగిసిన వెంటనే మార్చి 26న ఐపీఎల్ 2026 ప్రారంభం కానుంది. ఐపీఎల్ కోసం మార్చిలో విరాట్ కోహ్లీ భారత్‌కు తిరిగి రానున్నాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భారత్ మెరుగైన ప్రదర్శన చేసి ఫైనల్‌కు చేరితే ఆ మ్యాచ్‌కు కోహ్లీ హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి.



# బుమ్రా, హార్దిక్ రీఎంట్రీ

## రేపు న్యూజిలాండ్‌తో తొలి టీ20

సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో అనూహ్య పరాజయాన్ని ఎదుర్కొన్న టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్దమైంది. అప్‌కమింగ్ ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ముందు న్యూజిలాండ్‌తో ప్రీ ఫైనల్ టీ20 సిరీస్ ఆడేందుకు టీమిండియా సన్నదమైంది. నాగ్‌పూర్ వేదికగా బుధవారం జరిగే తొలి మ్యాచ్‌తో ఈ ఐదు టీ20ల సిరీస్‌కు తెరలేవనుంది. అనుభవం లేని ద్వితీయ శ్రేణి జట్టుతో వన్డే సిరీస్ గెలిచి చరిత్ర సృష్టించిన న్యూజిలాండ్.. అదే జోరులో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. తద్వారా రెట్టించిన ఆత్మ విశ్వాసంతో టీ20 ప్రపంచకప్ బరిలోకి దిగాలని భావిస్తోంది. మరోవైపు వన్డే సిరీస్‌కు భిన్నమైన సెటప్‌తో టీమిండియా టీ20 సిరీస్‌లో బరిలోకి దిగుతోంది. గత కొన్నేళ్లుగా టీ20ల్లో టీమిండియాకు తిరుగులేదు. ప్రత్యర్థి ఎవరైనా.. వేదిక ఏదైనా భారత్ ఆధిపత్యం చెలాయిస్తోంది. ప్రపంచకప్ ముందు ప్రీ ఫైనల్‌గా జరుగుతున్న ఈ సిరీస్‌లోనూ దుమ్మురేపి న్యూజిలాండ్‌ను మట్టికరిపించాలనే లక్ష్యంతో టీమిండియా బరిలోకి దిగుతోంది. టీమిండియా ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా.. ఈ ఐదు టీ20ల సిరీస్‌తో రీఎంట్రీ ఇవ్వనున్నాడు. మెగా టోర్నీ నేపథ్యంలోనే అతనితో పాటు స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు టీమ్‌మేనేజ్‌మెంట్ విశ్రాంతినిచ్చింది. ఈ ఇద్దరికి తోడుగా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి భారత జట్టులోకి పునరాగమనం చేయనున్నాడు. ఈ ముగ్గురి రాకతో బలహీనంగా ఉన్న భారత బౌలింగ్ ప్రమాదకరంగా మారనుంది. స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్, స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ గాయాలతో ఈ సిరీస్‌కు దూరమవ్వడం టీమిండియాకు ఎదురుదెబ్బే. సుందర్ స్థానంలో రవి బిష్ణోయ్, తిలక్ వర్మ స్థానంలో అయ్యర్ భారత జట్టులోకి వచ్చారు. దాంతో టీమిండియా కాంబినేషన్ ఎలా ఉంటుందనే ఆసక్తిగా మారింది.

**భారత జట్టు:**

**సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్ (మొదటి మూడు టీ20లకు), హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), రింకూ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), రవి బిష్ణోయ్**

# గంభీర్.. టీమిండియాను వదిలేయ్!



టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై భారత అభిమానుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు టీమిండియాకు అందించిన సేవలు చాలని, జట్టు నుంచి తప్పుకోవాలని రిక్వెస్ట్ చేస్తున్నారు. సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను టీమిండియా 1-2తో చేజార్చుకున్న సంగతి తెలిసిందే. ఇండోర్ వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 41 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. 338 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక భారత్ 296 పరుగులకు ఆలౌటైంది. విరాట్ కోహ్లీ సెంచరీ, నితీష్‌కుమార్ రెడ్డి, హర్షిత్ రాణాలు హాఫ్ సెంచరీలతో రాణించినా ఫలితం లేకపోయింది. ఈ ఘోర పరాజయం నేపథ్యంలోనే గంభీర్‌పై ఫ్యాన్స్ మండిపడుతున్నారు. హెడ్ కోచ్‌గా అతని వ్యూహాలు, నిర్ణయాలు, జట్టు ఎంపిక సరిగ్గా లేదని విమర్శిస్తున్నారు. గంభీర్‌ను హెడ్ కోచ్ పదవి బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ద్వితీయ శ్రేణి జట్లపై కూడా విజయం సాధించకపోవడం ఏంటని అసహనం వ్యక్తం చేస్తున్నారు. గంభీర్ బాధ్యతలు చేపట్టిన తర్వాతే గతంలో ఎన్నడూ లేని విధంగా టీమిండియా ఘోర ఓటములు చవిచూసిందని గుర్తు చేస్తున్నారు. శ్రీలంక పర్యటనలో వన్డే సిరీస్ కోల్పోవడం, న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్‌లో క్లీన్ స్వీప్ కావడం, బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఓటమి, సౌతాఫ్రికా చేతిలో టెస్ట్‌ల్లో క్లీన్ స్వీప్.. తాజాగా న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ఓటమి వంటి ఘోర పరాజయాలు ఎదురయ్యాయని నెటిజన్లు మండిపడుతున్నారు.

# విలియమ్స్ చరిత్ర



అమెరికా టెన్నిస్ స్టార్ వీనస్ విలియమ్స్ చరిత్ర సృష్టించింది. ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ చరిత్రలోనే సింగిల్స్ ఆడిన అత్యంత పెద్ద వయసున్న మహిళా క్రీడాకారిణిగా నిలిచింది. 45 ఏళ్ల వయసులో ఆమె ఈ టోర్నీ ఆడి ఈ అరుదైన ఘనతను అందుకుంది. ఈ క్రమంలో ఆమె జపాన్‌కు చెందిన కిమికో డేట్ (44 ఏళ్లు) రికార్డ్‌ను బద్దలు కొట్టింది. వీనస్ విలియమ్స్ ర్యాంక్ 576 కాగా.. వైల్డ్ కార్డ్ ఎంట్రీ ద్వారా ఆమె ఈ టోర్నీలో ఆడింది. మహిళల సింగిల్ తొలి రౌండ్ మ్యాచ్‌లో వీనస్ విలియమ్స్ 7 6, 3 6, 4 6 తేడాతో సెర్బియాకు చెందిన ఓల్గా డానిలోవిచ్ చేతిలో ఓటమిపాలైంది. ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌ను వీనస్ విలియమ్స్ తృటిలో చేజార్చుకుంది. తొలి సెట్ గెలిచిన ఆమె రెండో సెట్‌లో ఓటమిపాలైంది. మూడో సెట్‌లో 4 0తో ఆధిక్యంలో నిలిచి ఆధిపత్యం చెలాయించింది. కానీ ప్రత్యర్థి ఓల్గా పుంజుకొని వీనస్ విలియమ్స్‌ను మట్టికరిపించింది. 1998లో 17 ఏళ్ల వయసులో ఆస్ట్రేలియా ఓపెన్‌లోకి అరంగేట్రం చేసిన వీనస్

# మంజ్రేకర్‌పై కోహ్లీ అన్న సెటైర్లు

టీమిండియా మాజీ క్రికెటర్, వివాదాస్పద కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్‌పై విరాట్ కోహ్లీ సోదరుడు వికాస్ కోహ్లీ మరోసారి వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. న్యూజిలాండ్‌తో



మూడు వన్డేల సిరీస్‌లో2-1తో టీమిండియా ఓటమి పాలైన నేపథ్యంలో వికాస్ కోహ్లీ సోషల్ మీడియా వేదికగా సెటైరికల్ పోస్ట్ పెట్టాడు. ఇండోర్ వేదికగా ఆదివారం జరిగిన మూడో వన్డేలో న్యూజిలాండ్ 41 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించి 2-1తో సిరీస్ కైవసం చేసుకుంది. భారత గడ్డపై తొలి వన్డే సిరీస్ గెలిచి 38 ఏళ్ల కలను నెరవేర్చుకుంది. న్యూజిలాండ్ విధించిన 338 పరుగుల లక్ష్యఛేధనలో భారత్ 296 పరుగులకు ఆలౌటైంది. విరాట్ కోహ్లీ(108 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లతో 124) సెంచరీతో చెలరేగినా..నితీష్ కుమార్ రెడ్డి(57 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 53), హర్షిత్ రాణా(43 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 52) హాఫ్ సెంచరీలతో రాణించినా ఫలితం లేకపోయింది. విరాట్ కోహ్లీ ఈజీ ఫార్మాట్ ఎంచుకున్నాడని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సంజయ్ మంజ్రేకర్ విమర్శలు గుప్పించాడు. తన లోపాలను సరిదిద్దుకోకుండా టెస్ట్‌లకు వీడ్కోలు పలికాడని అభిప్రాయపడ్డాడు. జోరూట్, విలియమ్సన్, స్మిత్.. టెస్ట్ క్రికెట్‌లో రాణిస్తుంటే కోహ్లీ మాత్రం సుదీర్ఘ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడని తక్కువ చేసి మాట్లాడాడు. విరాట్ అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించినా బాగుండేదని, కానీ టాపార్డర్ బ్యాటర్‌కు ఎంతో సులువైన వన్డేల్లో కొనసాగడం తనను మరింత నిరాశకు గురి చేసిందన్నాడు. ఈ వ్యాఖ్యలపై అప్పట్లోనే సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. వికాస్ కోహ్లీ కూడా సంజయ్ మంజ్రేకర్ పేరు ప్రస్తావించకుండా ఘాటుగా బదులిచ్చాడు.

# రేపటిలోగా డిసైడ్ చేసుకోండి!

**బంగ్లాదేశ్‌కు ఐసీసీ డెడ్‌లైన్**

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్ వేదికగా జరిగే తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చేసిన విజ్ఞప్తికి అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) నిరాకరించినట్లు తెలుస్తోంది. మెగా టోర్నీకి తక్కువ సమయం ఉండటంతో వేదికల తరలింపు సాధ్యం కాదని బీసీబీకి ఐసీసీ స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే జనవరి 21లోపు భారత్‌కు వచ్చేది రానిది తేల్చుకోవాలని బీసీబీకి ఐసీసీ డెడ్‌లైన్ విధించినట్లు ప్రముఖ క్రికెట్ వెబ్‌సైట్ ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్‌ఫో పేర్కొంది. అయితే ఈ విషయంపై ఐసీసీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన అయితే రాలేదు. ఒకవేళ బంగ్లాదేశ్ మొండిపట్టుతో ఉంటే టోర్నీ నుంచి తప్పించనున్నారు. బంగ్లా స్థానంలో తదుపరి ర్యాంక్ కలిగిన స్కాట్లాండ్ జట్టు వరల్డ్‌కప్ మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంది. ఫిబ్రవరి 7 నుంచి 8 వరకు జరిగే టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీకి భారత్, శ్రీలంక ఆతిథ్యం ఇస్తున్న సంగతి తెలిసిందే. అయితే భద్రతా కారణాలను సాకుగా చూపుతూ బంగ్లాదేశ్ తమ మ్యాచ్‌లను భారత్ నుంచి శ్రీలంకకు తరలించాలని ఐసీసీకి లేఖ రాసింది.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
మంగళవారం 20-1-2026



తెలంగాణ చరిత్రలో కాకతీయ రాజవంశం కీలక పాత్ర పోషించింది. కాకతీయుల పాలన సుమారు 1000 నుంచి 1323 సంవత్సరాల వరకు కొనసాగింది. వరంగల్ కేంద్రంగా ఈ రాజవంశం బలమైన సైనిక వ్యవస్థను, పన్నుల ఆధారిత పరిపాలనను నిర్మించింది. సాగునీటి చెరువులు, కోటలు, దేవాలయ నిర్మాణాలు వారి పాలనలో విస్తరించాయి. అయితే ఈ అభివృద్ధి అడవుల్లో నివసించే ఆదివాసీ గోత్రాలకు మేలు చేయలేదు. కోయ, గోండు వంటి గిరిజన సమూహాలు స్వతంత్ర జీవన విధానాన్ని పాటించేవి. అడవులు, నదులు, కొండలు వారి జీవనాధారం. కాకతీయుల పాలనలో ఈ ప్రాంతాలపై పన్నులు విధించబడటం, గిరిజన నాయకులను లొంగదీసుకునే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలోని నుంచే సమ్మక్క-సారలమ్మ గాథ ఉద్భవించింది. గిరిజన సంప్రదాయ కథనాల ప్రకారం, సమ్మక్క అడవిలో పులుల మధ్య దొరికిన బాలిక. ఆమెను పగిడిద్ద రాజు కుటుంబం రక్షించి పెంచింది. కాలక్రమంలో ఆమె ఒక ఆదివాసీ నాయకురాలిగా ఎదిగింది. ఆమె భర్త పగిడిద్ద రాజు, కుమార్తె సారలమ్మ, అల్లుడు గోవింద రాజు కలిసి కాకతీయుల పన్నుల విధానానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు.

కాకతీయ రాజ్యం పంపిన సైన్యం అడవుల్లోకి ప్రవేశించి గిరిజన కుటుంబాలను నిర్మూలించే ప్రయత్నం చేసింది. ఈ యుద్ధంలో పగిడిద్ద రాజు, గోవింద రాజు హతమయ్యారు. సారలమ్మ యుద్ధరంగంలో వీరోచితంగా పోరాడుతూ ప్రాణాలు విడిచింది. తీవ్రంగా గాయపడిన సమ్మక్క అడవుల్లో కలిసిపోయిందని గిరిజన విశ్వాసం. ఈ త్యాగమే సమ్మక్క-సారలమ్మలను దేవతలుగా మలిచింది. వారు కేవలం ఆధ్యాత్మిక ప్రతీకలు కాదు. వారు ఆదివాసీ ప్రతిఘటనకు ప్రతిరూపాలు, రాజ్యాధికారానికి ఎదురైన గిరిజన ధైర్యానికి చిహ్నాలు. ఈ చారిత్రక స్మృతినే రెండేళ్లకొకసారి మేడారం జాతర రూపంలో కోయ గిరిజనులు స్మరించుకుంటున్నారు. తెలంగాణలో రెండేళ్లకొకసారి జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు రాష్ట్రం సిద్ధమవుతున్న వేళ, ప్రపంచంలోనే అతిపెద్ద ఆదివాసీ ఆధ్యాత్మిక సమాగమాలలో ఒకటైన ఈ ఉత్సవానికి కేంద్రబిందువైన మేడారం గ్రామం ఒక మహత్తర నిర్మాణ ప్రాంగణంగా మారింది. భక్తులు ఎక్కువ సంఖ్యలో ఆరాధన చేయగలిగేలా ఆలయ ప్రాంగణాన్ని విస్తరించే పనులు సాగుతున్నాయి. ఐదు అంతస్తుల ఎత్తుకు పైగా లేచిన ఈ చతురస్రాకార ద్వారం మూడు భారీ శిలాఫలకాలతో నిర్మించబడింది. ఒక వైపు ఆదివాసీ డప్పు వాయిద్యకారులు, నర్తకుల శిల్పాలు కనిపిస్తే, మరోవైపు పక్షి, ఆవు, బల్లి, స్వస్తిక వంటి సాంస్కృతిక చిహ్నాల సమాహారం దర్శనమిస్తోంది.

# ఆదివాసీ ప్రతిఘటనకు ప్రతిరూపాలు



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

తెలంగాణ చరిత్రలో కాకతీయుల కాలం ఒక ముఖ్యమైన దశ. అదే కాలంలో అడవుల్లో నివసించిన కోయ, గోండు వంటి గిరిజన సమూహాలు స్వతంత్ర జీవన విధానంతో ప్రకృతినే ఆధారంగా చేసుకుని జీవించేవి. రాజ్య పన్నుల విధానం అడవుల్లోకి విస్తరించిన సమయంలో గిరిజన జీవితం ప్రమాదంలో పడింది. ఈ పరిస్థితుల్లోనే సమ్మక్క-సారలమ్మ గాథ పుట్టింది. గిరిజన కథనాల ప్రకారం సమ్మక్క అడవుల్లో లభించిన బాలిక. ఆమె ధైర్యం, ప్రజల పట్ల ప్రేమ ఆమెను గిరిజన నాయకురాలిగా మార్చాయి. రాజ్యాధికారానికి ఎదురుగా నిలబడి పోరాడిన ఆమె కుటుంబం ప్రాణత్యాగం చేసింది. ఈ త్యాగం గిరిజనుల మనసుల్లో దేవత్వంగా మారింది. సమ్మక్క, సారలమ్మలు శిల్పాలుగా కాక జీవించి ఉన్న శక్తులుగా పూజింపబడుతున్నారు. ఈ విశ్వాసానికి ప్రతిరూపమే మేడారం జాతర. ఇది గిరిజనులు నిర్వహించే జాతరల్లో ప్రపంచంలోనే అతి పెద్దది. ప్రతి రెండేళ్లకు ఒకసారి లక్షల సంఖ్యలో ప్రజలు అడవుల మధ్య ఉన్న మేడారానికి వస్తారు. ఈ జాతరలో గర్భగుడులు ఉండవు. విగ్రహాలు ఉండవు. అడవే ఆలయం. బండరాయే దేవతకు రూపం. ఈ మార్పు భక్తులకు సౌలభ్యం కలిగించినా గిరిజనులలో ఆందోళనను కూడా కలిగిస్తోంది. ఎందుకంటే ఈ జాతర ఆడంబరానికి సంబంధించినది కాదు. ఇది గుర్తింపుకు సంబంధించినది. సమ్మక్క-సారలమ్మలు గిరిజనుల కోసం రాజ్యాధికారానికి ఎదురైన శక్తి. అడవిని కోల్పోతే ఈ జాతర ఆత్మను కోల్పోతుంది అనే భావన గిరిజనుల్లో బలంగా ఉంది.

మేడారం జాతర ఒక ఉత్సవం కాదు. అది ఒక చరిత్ర. ఒక పోరాట స్మృతి. ఒక జీవన తత్వం. ఇక్కడ పూజ భయంతో జరగదు. కృతజ్ఞతతో జరుగుతుంది. దేవతలను కోరే కన్నా తమ బాధను చెప్పుకునే స్థలంగా ఇది మారింది. సమ్మక్క-సారలమ్మ జాతర అనేది కాలాన్ని తట్టుకుని నిలిచిన ఒక జీవంత చరిత్ర. ఇది ఒక ఆచారం మాత్రమే కాదు అది ఒక సమూహ జ్ఞాపకం, ఒక ప్రతిఘటన స్మృతి, ఒక స్వాభిమాన గీతం. రాజ్యాధికారానికి ఎదురుగా నిలిచిన ఆదివాసీ ధైర్యాన్ని, ప్రకృతితో ఏకమై జీవించిన జీవన తత్వాన్ని ఈ జాతర తరతరాలకు చేరవేస్తోంది. నేటి కాలంలో అభివృద్ధి, ఆధునిక సౌకర్యాలు అనే మాటలు శక్తివంతంగా వినిపిస్తున్నాయి. కానీ మేడారం సందర్భంలో ఈ అభివృద్ధి గిరిజనుల స్వరాన్ని, వారి సంప్రదాయాన్ని కేంద్రంగా పెట్టుకుని జరగాలి. అడవిని కాపాడుతూ జరిగే అభివృద్ధి మాత్రమే నిజమైన అభివృద్ధి అవుతుంది. సమ్మక్క-సారలమ్మలు కేవలం దేవతలు కాదు. వారు అన్యాయానికి ఎదురు నిలిచిన గిరిజన ధైర్యానికి ప్రతీకలు. ఈ జాతర మనందరికీ ఒక ప్రశ్న వేస్తోంది. మనం మూలాలను మరిచి ముందుకు సాగాలా, లేక మూలాలను కాపాడుకుంటూ ముందుకు వెళ్లాలా? అడవితో పుట్టిన ఈ ఆరాధన అడవితోనే జీవించాలి. అప్పుడే సమ్మక్క-సారలమ్మలు గిరిజన హృదయాల్లోనే కాదు, మన సమాజపు ఆత్మలో కూడా శాశ్వతంగా నిలిచిపోతారు. సమ్మక్క- సారలమ్మ జాతర అనేది కేవలం ఒక ఆధ్యాత్మిక ఉత్సవం మాత్రమే కాదు అది తెలంగాణ ఆదివాసీ సమాజం శతాబ్దాలుగా అనుభవించిన అణచివేతకు ఎదురు నిలిచిన ఒక సజీవ చారిత్రక స్మృతి. రాజ్యాధికారానికి ఎదురుగా నిలబడి తమ అడవులను, తమ జీవన విధానాన్ని, తమ స్వేచ్ఛను కాపాడుకునేందుకు గిరిజన సమాజం చేసిన పోరాటం ఈ జాతర రూపంలో ఇప్పటికీ శ్వాస తీసుకుంటోంది. అందుకే కాలం ఎంత మారినా, శతాబ్దాలు గడిచినా, మేడారం జాతర తన ప్రాముఖ్యతను కోల్పోకుండా ప్రతి రెండేళ్లకూ లక్షలాది ప్రజలను ఆకర్షిస్తోంది.

కాకతీయుల వంటి శక్తివంతమైన రాజ్యానికి ఎదురు నిలవడం సైనికంగా అసాధ్యమేనని అనిపించవచ్చు. కానీ సమ్మక్క-సారలమ్మ గాథ చాటేది ఒక్కటే- శక్తి ఎప్పుడూ సైన్యంలోనే ఉండదు న్యాయంలో, సమూహ చైతన్యంలో, స్వాభిమానంలో కూడా ఉంటుంది. ఈ పోరాటం చరిత్ర పుస్తకాలలో అధికారికంగా పెద్దగా నమోదు కాలేకపోయినా, గిరిజనుల మౌఖిక సంప్రదాయాల్లో, విశ్వాసాల్లో, ఆచారాల్లో తరతరాలుగా జీవిస్తూ వచ్చింది. ఇదే ఈ గాథ యొక్క అసలైన విజయం. సమ్మక్క, సారలమ్మలు శిల్పాలుగా కాక జీవించి ఉన్న శక్తులుగా పూజింపబడటం ఈ జాతర యొక్క ప్రధాన విశిష్టత. ఇక్కడ గర్భగుడులు లేవు, విగ్రహాలు లేవు. అడవే ఆలయం. బండరాయే దేవతకు రూపం. ఈ ప్రకృతి కేంద్రిత ఆరాధన గిరిజనుల జీవన తత్వానికి ప్రతిరూపం. ప్రకృతిని జయించాల్సిన వనరుగా కాక, జీవన సహచరిగా చూసే దృక్కోణం ఈ జాతరలో స్పష్టంగా ప్రతిఫలిస్తుంది. గిరిజనుల దృష్టిలో మేడారం ఒక ప్రదర్శన కాదు. అది వారి చరిత్రను, వారి గాయాలను, వారి గౌరవాన్ని గుర్తుచేసుకునే స్థలం. ఇక్కడ పూజ భయంతో జరగదు కృతజ్ఞతతో జరుగుతుంది. దేవతలను కోరడం కన్నా, తమ బాధను చెప్పుకునే స్థలంగా మేడారం మారింది. ఈ ప్రత్యేకతే మేడారాన్ని ఇతర ఆధ్యాత్మిక ఉత్సవాల నుంచి వేరు చేస్తుంది. నేటి కాలంలో మేడారం జాతర ఒక కీలక మలుపులో నిలిచింది. సౌకర్యాలు, నిర్మాణాలు, అభివృద్ధి అనే పేర్లతో జాతర స్వరూపం మారుతోంది. భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఏర్పాట్లు అవసరమే. కానీ ఈ అభివృద్ధి జాతర ఆత్మను దెబ్బతీయకూడదు. ఎందుకంటే మేడారం జాతర ఆడంబరానికి సంబంధించినది కాదు అది గుర్తింపుకు సంబంధించినది. అడవిని కోల్పోతే ఈ జాతర తన మూల స్వరూపాన్ని కోల్పోతుంది అనే భావన గిరిజన సమాజంలో బలంగా ఉంది.

అభివృద్ధి అనేది మూలాలను తుడిచిపెట్టడం కాదు మూలాలను కాపాడుకుంటూ ముందుకు సాగడం. మేడారం విషయంలో తీసుకునే ప్రతి నిర్ణయంలో గిరిజనుల స్వరం కేంద్రంగా ఉండాలి. వారి సంప్రదాయాలు, వారి ప్రకృతి సంబంధం, వారి విశ్వాసం గౌరవించబడాలి. లేనిపక్షంలో ఈ జాతర కూడా ఒక అధికారిక ఉత్సవంగా మారిపోయి, తన అసలైన చారిత్రక అర్థాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. సమ్మక్క-సారలమ్మకు ఆలయ గర్భగృహాలు లేవు, విగ్రహాలకు మెరుపులు లేవు. వనమే వారి ఆలయం. అడవే వారి అస్తిత్వం. అందుకే వారికి అర్పించే నైవేద్యం కూడా భూమి నుండి పుట్టినదే కావాలి అనే భావన ఇక్కడ బలంగా కనిపిస్తుంది. ఈ దృష్టిలో సమ్మక్క-సారలమ్మ జాతర ఒక మత ఉత్సవంగా మాత్రమే కాదు ప్రకృతి పరిరక్షణ, సామాజిక సమానత్వం, ఆదివాసీ సంస్కృతి గౌరవానికి నిలువెత్తు సాక్ష్యం. వనదేవతలకు సమర్పించే ప్రతి కానుక, ఆధునిక వినియోగవాదానికి ప్రత్యామ్నాయంగా నిలిచే ఒక సాంస్కృతిక ప్రకటనగా భావించవచ్చు. సమ్మక్క-సారలమ్మలు గిరిజనుల హృదయాల్లో దేవతలుగా మారడానికి కారణం వారి త్యాగం. ఆ త్యాగం ఒక కాలానికి పరిమితం కాలేదు. అది నేటికీ అన్యాయానికి ఎదురు నిలిచే ప్రతి పోరాటంలో ప్రతిధ్వనిస్తోంది. అందుకే మేడారం జాతర ఒక ఉత్సవం కాదు అది ఒక నిరంతర పోరాట జ్ఞాపకం, ఒక జీవన తత్వం. అడవితో పుట్టిన ఈ ఆరాధన అడవితోనే జీవించాలి. అప్పుడే సమ్మక్క-సారలమ్మల వీరగాథ తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది.



## వనదేవతలకు సమర్పించే నైవేద్యం

సమ్మక్క-సారలమ్మ జాతరలో భక్తులు సమర్పించే నైవేద్యాలు, కానుకలు సాధారణ ఆచారాలు మాత్రమే కావు. అవి వనదేవతలతో ఆదివాసీ సమాజం కలిగి ఉన్న సహజీవన సంబంధానికి, కృతజ్ఞత భావానికి ప్రతీకలు. ఈ కానుకలలో ఎక్కడా అతి విలాసం లేదు. ప్రకృతిలో లభించే వస్తువులే దేవతలకు అర్పణలుగా మారతాయి.

- బెల్లం – తీపి మాట, మధుర జీవితం, సామాజిక సౌహార్దానికి సూచిక
- కొబ్బరికాయలు – సంపూర్ణత, శుభారంభం, జీవన చక్రానికి సంకేతం
- నువ్వులు – భూమి సారవంతత, వంశ పరంపర కొనసాగింపుకు ప్రతీక
- చెక్కర, బెల్లం నీళ్లు – ప్రకృతి ఇచ్చే సహజ శక్తులకు కృతజ్ఞత
- అన్నం, జొన్నలు, సజ్జలు – అడవి జీవనానికి ఆధారం అయిన ఆహార ధాన్యాలు
- మద్యం (సారా) – వనదేవతలతో సమానత్వ భావన, అధికారిక దేవాలయ సంప్రదాయానికి భిన్నమైన ఆదివాసీ విశ్వాసం
- పశు బలులు (మేకలు, కోళ్లు) – జీవితం-మరణం మధ్య సమతుల్యతను గుర్తుచేసే ప్రాచీన ఆచారం
- ఇవేకాకుండా భక్తులు తమ సామర్థ్యాన్ని బట్టి చీరలు, గొంగళీలు, వెండి ఆభరణాలు, మట్టి పాత్రలు, అడవి పూలు, ఆకులు కూడా సమర్పిస్తారు. ఈ కానుకలు దేవతలకు భౌతిక సంపదను అర్పించడానికన్నా, మనిషి-ప్రకృతి మధ్య ఉన్న ఋణ సంబంధాన్ని అంగీకరించే సంకేతాలు.

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.